జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 7 సంచిక 229 | హైదరాబాద్, అక్టోబరు 30 సోమవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# పేదల, రైతుల సంక్షేమంపై దృష్టి

## తెలంగాణ దేశానికే తలమానికం కావడం గర్వకారణం..

## తెలంగాణకు మహామహులు వస్తున్నరు..: సీఎం కేసీఆర్



తిరుమలగిరి: పేదలు, రైతుల సంక్షేమంపై బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ముఖ్యంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరిలో జరిగిన ప్రజా ఆశ్వీరాద సభలో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాదరి కిశోర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం కేసీఆర్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాక ముందు పరిస్థితులు నా కన్నా మీకు ఎక్కువ తెలుసు. ఊళ్లలో అలజడులు.. అరాచకాలు.. ఆత్మహత్యలు.. ఆకలి చావులు.. వలసలు.. కరెంటు లేదు.. మంచినీళ్లు లేవు.. సాగునీళ్ల జాడలేదు.. చాలా భయంకరమైన పరిస్థితి తెలంగాణది. ఆ రోజు వలసలు పోయి చెట్టుకొకరు గుట్టకొకరం అయిపోయాం. దీన్నింతటిని కూర్చి ప్రజలు వాపస్ వచ్చేట్టట్టు.. యువకులు తమ గ్రామానికే వచ్చేటట్టు.. తమ పొలాల్లో శాంతియుతంగా పని చేసుకొని ఉండేటట్టు ఎజెండాకు రూపకల్పన చేశాం. దేవుడి దయతో బ్రహ్మాండంగా సక్సెస్ అయ్యింది. నేను గర్వంగా చెబుతున్నా భారతదేశంలో 70 ఏళ్ల నుంచి స్థిరపడిన అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ తలసరి ఆదాయంలో నెంబర్ వన్‌గా ఉన్నది. ఒకనాడు 1100 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఉన్న రాష్ట్రం.. ఇవాళ 2200పై చిలుకు దాటిపోతున్నది. ఇది కూడా తెలంగాణ కీర్తి' అన్నారు. (మిగతా 2లో..)

# ఈజిప్టు అధ్యక్షుడితో మోదీ ఫోన్ సంభాషణ..



ఢిల్లీ: ఇజ్రాయెల్, హమాస్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో.. భారత ప్రభుత్వం ఈ అంశంపై అనుబంధ దేశాలతో టచ్‌లో ఉంటూ, ఆయా పరిస్థితులపై చర్చలు జరుపుతోంది. ఇప్పటికే ప్రధాని మోదీ ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, జోర్డాన్ కింగ్ అబ్దులా తో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పుడు తాజాగా ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అల్-సీసీతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో రోజురోజుకీ దిగజారుతున్న పరిస్థితులు, మానవతా సంక్షోభం, ఉగ్రవాదం, సామాన్య పౌరుల మరణాలపై ఆయనతో మాట్లాడినట్లు ట్విటర్ మాధ్యమంగా ప్రధాని మోదీ తెలిపారు. "శనివారం ఈజిప్టు అధ్యక్షుడు అల్-సీసీతో ఫోన్‌లో మాట్లాడటం జరిగింది. పశ్చిమాసియాలో క్షీణిస్తున్న భద్రత, మానవతా పరిస్థితులపై పరస్పర అభిప్రాయాలను పంచుకున్నాం. తీవ్రవాదం, హింస, పౌర ప్రాణనష్టంపై ఆందోళనలు వ్యక్తం చేశాం. పశ్చిమాసియాలో వెంటనే శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించి, స్థిరత్వాన్ని సాధించాల్సిన అవసరం ఉందని పరస్పర అంగీకారానికి వచ్చాం" అని మోదీ ట్వీట్ చేశారు. అలాగే.. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం వల్ల ప్రభావితమైన బాధితులకు మానవతా సాయం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అటు.. ఈ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణపై ఈజిప్టు అధ్యక్ష కార్యాలయ ప్రతినిధి కూడా స్పందించారు. గాజాలో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలపైనా ఇరువురు నేతలు చర్చించారన్నారు. పరిస్థితులు మరింత దిగజారడం వల్ల వచ్చే ముప్పుపై కూడా ఇద్దరు చర్చించారని పేర్కొన్నారు. సామాన్య పౌరుల జీవితాలు, ప్రాంతీయ భద్రతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండనుందన్న అంశాలపై కూడా చర్చలు జరిపినట్టు వెల్లడించారు.

ఇదిలావుండగా.. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఏకంగా 5 వేలకు పైగా రాకెట్లతో మెరుపుదాడులు చేసిన విషయం తెలిసిందే. అంతేకాదు.. భూమి, వాయు, జల మార్గాల ద్వారా హమాస్ యోధులు ఇజ్రాయెల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో 1,400 మంది మరణించారు. ఇందుకు ప్రతీకారం ఇజ్రాయెల్ సైన్యం సైతం హమాస్ నియంత్రణలో ఉన్న గాజాపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఓవైపు వైమానిక దాడులు, మరోవైపు గ్రౌండ్ ఆపరేషన్స్‌తో.. హమాస్‌ని వెంటాడి వేటాడుతోంది. అయితే.. ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో వేలాదిమంది గాజా పౌరులు మరణించినట్టు హమాస్ చెబుతోంది.

## కారెక్కండి సారూ...

### నాగంను స్వయంగా పార్టీలోకి ఆహ్వానించిన కెటిఆర్, హరీష్ రావు..



హైదరాబాద్ :కాంగ్రెస్ కు రాజీనామా చేసిన సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు. హైదరాబాద్‌లోని నాగం నివాసానికి వెళ్లిన మంత్రులు..ఈ మేరకు చర్చలు జరుపారు. మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాగర్ కర్నూల్ టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించకపోవడంతో నాగం అసంతృప్తిగా ఉన్నారు. దీంతో హస్తం పార్టీని వీడారు నాగం. అంతకు ముందు నాగం జనార్ధన్ రెడ్డితో బిఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి మంతనాలు జరిపారు.. ఈ నేపథ్యంలోనే కెటిఆర్, హరీష్ రావులు స్వయంగా నాగంతో రాజకీయ భవిష్యత్ గురించి మాట్లాడారు..పార్టీలో గౌరవప్రద స్థానం కల్పిస్తామని సీనియర్ నేతకు హామీ ఇచ్చారు..

### రెండో జాబితాలో చోటు దక్కని కాంగ్రెస్ అసంతృప్త నేతలు...

## సైలెంట్ భవిష్యత్తు కార్యచరణ..

హైదరాబాద్: కాంగ్రెస్ 55 మందితో మొదటి లిస్టు విడుదలైనప్పుడు నిరసనలతో గాంధీభవన్ అట్టుడికి పోయింది. ఓల్డ్ సిటీలోని వివిధ ప్రాంతాల నుంచి టికెట్స్ ఆశించి భంగపడ్డ మైనారిటీ లీడర్స్ గాంధీభవన్ ముందు నిరసన తెలియజేశారు. ఇక గద్వాల్ టికెట్ ఆశించి బంగపడ్డ స్టూడెంట్ లీడర్ కురువ విజయ్ కుమార్ తన టికెట్టును రేవంత్ రెడ్డికి అమ్ముకున్నాడు అంటూ బాహాటంగా నిరసన తెలియజేశారు.ఏకంగా డీజీపీకి ఫిర్యాదు చేసి మనీ లాండరింగ్ విషయంపై విచారణ జరపాలని కోరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల కింద కురువ విజయ్ కుమార్‌ని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయితే సెకండ్ లిస్టులో అసంతృప్త నేతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని నిరసనలు ఎక్కువగా ఉండే ఛాన్స్ ఉందని అందరూ భావించారు. కానీ సెకండ్ లిస్టు విడుదలైన తర్వాత గాంధీభవన్‌కి పెద్దగా నిరసన సెగ తాకలేదు.కానీ రెండో జాబితా తర్వాత అసంతృప్తితో ఉన్న నేతలు తమ తమ భవిష్యత్తుకు సంబంధించిన వ్యూహ రచన సైలెంట్‌గా చేసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ నుంచి పీజేఆర్ కుమారుడు



విష్ణువర్ధన్ రెడ్డికి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని ధీమాగా ఉన్నారు. కానీ సెకండ్ లిస్ట్ విడుదలైన తర్వాత అతని పేరు లేకుండా మహమ్మద్ అజారుద్దీన్‌కి టికెట్ కేటాయించడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత 55 ఏళ్లుగా తన కుటుంబం కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేసిందని ఒకప్పుడు హైదరాబాదులో కాంగ్రెస్ అంటే పీజేఆర్‌గా గుర్తింపు ఉందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అయితే ఈ టికెట్ పై మొదటి నుంచి అజారుద్దీన్, విష్ణువర్ధన్ రెడ్డి మధ్య పోటీ నడుస్తూ ఉండగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతి మరకలు (మిగతా 2లో..)

## అలీగఢ్ వర్సిటీకి సొంత శాటిలైట్..

### ఆరు నెలల్లో ఉపగ్రహ ప్రయోగం



ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిము యూనివర్శిటీ (ఏఎంయూ) తన అవసరాల కోసం సొంతంగా ఒక ఉపగ్రహాన్ని రూపొందించుకొని ప్రయోగించే పనులకు ఇటీవల నాంది పలికింది. ఏఎంయూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి కేంద్ర అంతరిక్ష విభాగానికి చెందిన భారత జాతీయ అంతరిక్ష కార్యక్రమాల ప్రోత్సాహం, అధీకృత కేంద్రం(ఇన్‌స్పేస్) ఆమోదం తెలిపింది. తొలిసారిగా చేపట్టిన ఉపగ్రహ కార్యక్రమానికి ఏఎంయూ వ్యవస్థాపకుడు సర్ సయిద్ అహ్మద్ ఖాన్‌కు గుర్తుగా 'ఎస్ఎస్ ఏఎంయూ శాట్' అని పేరు పెట్టారు. వచ్చే ఆరు మాసాల్లో ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని ఏఎంయూ వర్గాలు తెలిపాయి.

## కేరళ వరుస పేలుళ్లకు బాధ్యత వహిస్తూ పోలీసులు ముందు లొంగిపోయిన వ్యక్తి



త్రిస్సూర్: కేళలోని త్రిస్సూర్ జిల్లాలోని కలమస్సేరి ప్రార్థనా కన్వెన్షన్ సెంటర్ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకున్న వరుస పేలుళ్లకు బాధ్యత వహిస్తూ ఓ వ్యక్తి పోలీసుల ముందు లొంగిపోయాడు. అతడి పేరు డొమినిక్ మార్టిన్ అని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేరళ ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) అజిత్ కుమార్ ప్రకటన విడుదల చేశారు. " ఒక వ్యక్తి త్రిసూర్ రూరల్‌లోని కొడకరా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పేలుళ్లకు పాల్పడ్డానని చెప్పాడు. అతని పేరు డొమినిక్ మార్టిన్. అతను అదే ప్రాంతానికి చెందినవాడని చెప్పాడు. మేము ఈ కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తున్నాం. కాగా ఈ పేలుళ్లు హాల్ మధ్య భాగంలో జరిగాయి" అని వివరించారు. అయితే ఈ పేలుళ్ల వెనుక అతడి హస్తం ఉందా లేదా అనే విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. (మిగతా 2లో..)

## డొనాల్డ్ ట్రంప్ గెలుపు అమెరికాకు అత్యంత ప్రమాదకరం..

### నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు



అమెరికా : అధ్యక్ష అభ్యర్థి బరిలో ఉన్న ఇండియన్-అమెరియన్ నిక్కీ హేలీ తాజాగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల్లో ట్రంప్ గెలిస్తే.. నాలుగేళ్ల పాటు గందరగోళం నెలకొంటుందని, ప్రతీకార ఘటనలూ వెలుగు చూడొచ్చని కుండబద్దలు కొట్టారు. అలాంటి వాతావరణం అమెరికాకు ఎంతో ప్రమాదకరమైనదని హెచ్చరించారు. ఒక నౌకను స్థిరంగా నడిపించేందుకు సమర్థవంతమైన కెప్టెన్ ఎంత అవసరమో.. దేశాన్ని నడిపించేందుకు అంతే సమర్థుడైన నాయకుడు అవసరమని పేర్కొన్నారు. కాబట్టి.. ఆచి తూచి ఓట్లు వేయాల్సిందిగా ప్రజల్ని కోరారు. శనివారం లాస్ వెగాస్‌లో జూయిష్ రిపబ్లికన్లను ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగంలో.. ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.ఇజ్రాయెల్ అనుకూల విధానాల విషయంలో డొనాల్డ్ ట్రంప్‌కు నిక్కీ హేలీ క్రెడిట్ ఇచ్చినప్పటికీ.. భవిష్యత్తులో అతనేం చేస్తామని ప్రశ్నించారు. ట్రంప్ ఒక ఇజ్రాయెల్ అనుకూల అధ్యక్షుడిగా చరిత్ర గుర్తిస్తుందని.. ఇరాన్ ఒప్పందం నుండి వైదొలగడం తప్పనిసరి అని పేర్కొన్నారు. జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించడం సరైనదేని.. అందుకు ట్రంప్‌కు క్రెడిట్ ఇవ్వడం సంతోషంగా ఉందని.. ఆ ప్రయత్నాల్లో తానూ భాగమైనందుకు గర్వపడుతున్నానని చెప్పారు. కానీ.. అమెరికన్లుగా ఒక ప్రశ్న అడగాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో ట్రంప్ ఏం చేశాడో అందరికీ తెలుసని, కానీ భవిష్యత్తులో అతడేం చేస్తాడన్నదే అదిపెద్ద ప్రశ్న అని తెలిపారు. ప్రస్తుతం మనం అత్యంత ప్రమాదకరమైన కాలంలో జీవిస్తున్నానని ఆమె ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్-హమాస్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలతో పాటు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోని హింసను ప్రస్తావిస్తూ.. నేడు ప్రపంచం మొత్తం తగలబడిబోతోందని నిక్కీ హేలీ వ్యాఖ్యానించారు. ఒక మిలిటరీ భార్యగా, ఇద్దరు పిల్లల తల్లిగా.. యుద్ధాన్ని ఆపి, శాంతి నెలకొల్పి, అమెరికన్ ప్రజల్ని కాపాడటమే తనకు ముఖ్యమని తెలిపారు. ఆలస్యం కాకముందే మన స్వేచ్ఛను మనం రక్షించుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనల్ని సరైన దారిలో నడిపించే (మిగతా 2లో..)

## హైదరాబాద్‌లో కేంద్ర సాయుధ బలగాలలో ఫ్లాగ్ మార్చ్



హైదరాబాద్ : పోలీసులు కేంద్ర సాయుధ బలగాల సిబ్బందితో కలిసి ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాన్య ప్రజల్లో భద్రత, విశ్వాసాన్ని పెంపొందించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు.రానున్న శాసనసభ ఎన్నికల సందర్భంగా.. హైదరాబాదు సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తుంది. ఇన్సిడెంట్ ఫ్రీ అండ్ ఫేర్‌గా ఎన్నికలు జరుపడమే లక్ష్యంగా (మిగతా 2లో..)

## డొనాల్డ్ ట్రంప్ గెలుపు అమెరికాకు అత్యంత ప్రమాదకరం..

(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు కావాలని.. గందరగోళం సృష్టించకుండా శాంతిని నెలకొల్పే లీడర్ అవసరమని పేర్కొన్నారు. ఓడ మునిగిపోకుండా కాపాడే సమర్థవంతమైన నాయకుడు ఈ అమెరికాకు కావాలని చెప్పుకొచ్చారు.ఒకవేళ జో బైడెన్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికైతే.. దాన్ని కూడా ఈ అమెరికా భరించలేదని నిక్కీ హేలీ బాంబ్ పేల్చారు. బైడెనే ఓ చెడ్డవాడు అనుకుంటే, కమలా హారిస్ అంతకుమించిన రాక్షసి అని షాకింగ్ కామెంట్స్ చేసింది. కమలా హారిస్ అధ్యక్షురాలైతే.. మనుగడ సాగించలేమని పేర్కొన్నారు. మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైందని, నైతిక స్పష్టతను తిరిగి పొందాలని అమెరికా ప్రజలకు పిలుపునిచ్చారు. మంచి, చెడుల వ్యత్యాసాన్ని గుర్తించి.. చెడుని మంచి ఓడిస్తుందన్న నిర్ధారణకు కట్టుబడి ఉండాలన్నారు.

## కేరళ వరుస పేలుళ్లకు బాధ్యత వహిస్తూ పోలీసులు ముందు లొంగిపోయిన వ్యక్తి

(మొదటి పేజీ తరువాయి)

లోతుగా విచారించనున్నట్టు వెల్లడించారు. కాగా బాంబు పేలుళ్లలో ఒక మహిళ మృతి చెందగా, 40 మంది గాయపడ్డారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. పేలుడు పదార్థాలను టిఫిన్ బాక్స్‌లో నింపారని, ఉదయం 9:40 గంటలకు మొదటి పేలుడు జరిగినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ఉపయోగించినట్లు కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్ ప్రకటించారు. కాగా ఇది చాలా దురదృష్టకర సంఘటనని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు. వివరాలు సేకరిస్తున్నామని, ఈ ఘటనను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని అన్నారు. డీజీపీతో మాట్లాడానని, విచారణ తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు. కాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. పేలుళ్లపై ఆయన అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌లో కేంద్ర సాయుధ బలగాలలో ఫ్లాగ్ మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాదు సిటీ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యా ఆదేశానుసారంగా నగరంలో సౌత్ వెస్ట్ డీసీపీ ఆధ్వర్యంలో షాహినాయత్ గంజ్ పోలీసు స్టేషన్ నుండి , సౌత్ జోన్ డీసీపీ అధ్వర్యంలో ఫలక్ నుమా పిఎస్ నుండి, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో బండ్లగూడా పి.ఎస్ నుండి, వెస్ట్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో జూబిలి హిల్స్ పి.ఎస్ నుండి , సెంట్రల్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ పిఎస్ నుండి, నార్త్ డీసీపీ, ఈస్ట్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వంచినారు.ప్రజలకు తోడుగా మేమున్నాము అనే భరోసా ఇచ్చే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. పోలింగ్ సందర్భంగా ప్రజలు నిర్భయంగా బయటికి వెళ్లి ఓటు వేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించినట్టు హైదరాబాద్ పోలీసులు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా దాడులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు హైదరాబాద్ పోలీసులు.

## శ్రీనగర్‌లో టెరరిస్టుల ఘాతుకం.. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై కాల్పులు



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో టెర్రరిస్టులు మరోసారి తెగబడ్డారు. శ్రీనగర్ లోని ఈద్గా సమీపంలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై కాల్పులు జరిపారు. కాల్పుల్లో గాయపడిన ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈద్గా గ్రౌండ్స్‌లో పిల్లలతో కలిసి క్రికెట్ ఆడుతుండగా అహ్మద్ వనిపై టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలిని భద్రతా బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఈద్గా పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం టెర్రరిస్టులు కాల్పులకు ఒక పిస్తోల్ వాడినట్టు తెలుస్తోందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కశ్మీర్ జోన్ పోలీసులు ఒక ట్వీట్‌లో తెలిపారు.

## మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లింగాల కమల్ రాజు సత్కారం



మధిర అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కొరకు బిఆర్ఎన్ నాయకులు ఇంటింటా ప్రచారం చేస్తూ బిఆర్ఎస్ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ దాచేపల్లి ముత్యాలు ప్రత్యేకంగా కలిసి ఓట్లను అభ్యర్థించిన బిఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు . ఈ సందర్భంగా కమల్ రాజు ముత్యాలు ఘనంగా సత్కరించి శుభాశీస్సులు తెలియజేశారు. కమల్ రాజు తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీమతి విద్యాలతా వెంకటరెడ్డి, టిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కనుమూరు వెంకటేశ్వరరావు, కపిలవాయి జగన్ మోహన్ రావు , పల్ల పోతుల ప్రసాద రావు డోకుపర్తి సత్యంబాబు , భువనగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

# పేదల, రైతుల సంక్షేమంపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

**తెలంగాణ దేశానికే తలమానికం కావడం గర్వకారణం..**

'ప్రపంచవ్యాప్తంగా ఒక రాష్ట్రం యొక్క ప్రగతిని కొలవాలంటే గీటురాయిగా చూసేది అన్నింటిని మించి తలసరి ఆదాయాన్ని చూస్తరు. తొమ్మిది పదేళ్లలో తెలంగాణ దేశానికే తలమానికం కావడం.. పెద్ద పెద్ద రాష్ట్రాలను మించి ఉండడం అనేది మనందరికీ గర్వకారణం. పేదల సంక్షేమం, రైతుల సంక్షేమం.. అటు వ్యవసాయ విప్లవం.. అటు పారిశ్రామిక పెట్టుబడులు.. ఐటీ రంగంలో పెట్టుబడులు అన్నింటిపై స్ట్రాటజీ పెట్టుకున్నాం. వృత్తి పనులవారు ఎవరైతో ఉన్నారో వారిని విస్మరించలేదు. గొర్రెల పెంపకందారులకు గొర్రెలను పంచుకుంటున్నాం.. చేపల పెంపకందారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. రూ.33వేలకోట్ల చేపల ఉత్పత్తులను తెలంగాణ అమ్మింది. చెరువులు, ప్రాజెక్టులు నిండి ఉంటే.. చుక్కనీరు లేని తిరుమలగిరి, తుంగతుర్తి నియోజకవర్గంలో ఎండాకాలంలో చెరువు మత్తడి దుంకే పరిస్థితి ఉన్నది. బ్రహ్మాండంగా మత్స్య సంపద పెరుగుతున్నది. భూగర్భ జలాలు పెరుగుతున్నాయ్' అన్నారు.

**తెలంగాణకు మహామహులు వస్తున్నరు..**

కర్నాటక రాష్ట్రం నుంచి ఉప ముఖ్యమంత్రి వచ్చాడు. ఈ మధ్య మన రాష్ట్రానికి మహామహులు వస్తున్నరు. ఒకాయన లుంగీ కొట్టుకొని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వస్తడు. ఆయన రాష్ట్రంలో అన్నానికి గతిలేదు. తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తున్నడో లేదో తెల్వది. తెలంగాణ మొత్తానికి ఉత్తరప్రదేశ్, బిహార్, బెంగాల్ నుంచి నాట్లు వేయడానికి కూలీలు వస్తున్నరు. బతుకడానికి వస్తున్నరు. ఆ ముఖ్యమంత్రులు వచ్చి మనకు పాఠం చెబుతున్నరు ఈడ. నవ్వాల్నో ఏమో అర్థం కాదు. నిన్న కర్నాటక ఉప ముఖ్యమంత్రి వచ్చి తెలంగాణకు సుద్దులు చెబుతున్నడు.

మా కర్నాటకలో మీకు తెలుసా కేటీఆర్.. రోజుకు 5గంటల కరెంటు ఇస్తున్నం అంటున్నడు. సన్నాసి మాకు 24గంటల కరెంటు ఉన్నది అంటున్న. ఐదుగంటలోడు వచ్చి 24 గంటలోనికి చెబుతున్నడు. కర్నాటకు వచ్చి సూద్దువుదా మా అందం అంటున్నడు. నేను ఒక్కటే మాట చెబుతున్నా.

తెలంగాణ ఉద్యమం కోసం బయలుదేరిన నాడు పడికెడు మందితో బయలుదేరాం. ఏం జరుగుతుందో తెలియదు. మొండి ధైర్యంతో.. ఎక్కడ రాజీపడకుండా.. వెనక్కి తిరిగి చూడకుండా ప్రజలకు ఒకటే మాట చెప్పాను. ఉద్యమానికి ద్రోహం చేస్తే.. ఉద్యమాన్ని వదిలేస్తే మమ్మల్ని రాళ్లతో కొట్టిచంపండి అని చెప్పాను. అంత సీరియస్‌గా తీసుకొని ఉద్యమం చేసిన నాడు ఎవరూ లేరు.

ఒక్క కాంగ్రెస్, బీజేపీ నాయకుడు వచ్చిండా? జేఏసీ రాజీనామా చేయాలంటే ఒకడు అమెరికా పారిపోయిండు.. మంత్రి పదవులు విడిచిపెట్టలే. ఎన్నడూ రాలే. పదవులే ప్రామాణీకం.. పైసలే మాకు ప్రమాణం అనుకొనిపోయారు తప్పా.. ఉద్యమంలో కలిసిరాలే. ఇవాళ అడ్డం పొడువు మాట్లాడతరు. ఇవాళ నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.30వేలకోట్లతో భారతదేశంలోనే తొలి అల్ట్రా మెగా పవర్‌ప్లాంట్ వస్తున్నది. రాబోయే నాలుగైదు నెలల్లో 4వేల మెగావాట్ల విద్యుత్ అదనంగా ఉత్పత్తి కాబోతున్నది. పేదల సంక్షేమం, అన్నిరంగాల్లో ముందుండాలని చేసుకుంటూ వెళ్తున్నాం' అన్నారు.

# సైలెంట్ భవిష్యత్తు కార్యచరణ..

(మొదటి పేజీ తరువాయి)


అజారుద్దీన్‌కి అంటుకొని నాన్ వెలబుల్ అరెస్టు వారెంట్ జారీ అవ్వడంతో ఇక తనకు టికెట్ సుగుమమని విష్ణువర్ధన్ భావించారు. కానీ అజారుద్దీన్ స్క్రీనింగ్ కమిటీ మెంబర్‌గా ఉండటం వల్ల ఢిల్లీలో లాబీయింగ్ చేసుకుని టికెట్ తనకే దక్కేలా చూసుకున్నారు. ఇక విష్ణు చెల్లికి ఖైరతాబాద్ టికెట్ కేటాయించడంతో కుటుంబానికి ఒక్కటే టికెట్ అనే ఫార్ములా పై విష్ణువర్ధన్ రెడ్డిని పక్కన పెట్టింది కాంగ్రెస్. అయితే కాంగ్రెస్‌లోకి కొత్తగా చేరిన నాయకులకు ఫ్యామిలీకి రెండు టికెట్లు ఇచ్చి, తన విషయానికి వచ్చేసరికి ఉదయపూర్ డిక్లరేషన్ గుర్తుకు వచ్చిందా అంటూ మాట్లాడారు. ఇక విష్ణువర్ధన్ రెడ్డి తన కార్యకర్తల అభీష్టం మేరకు జూబ్లీహిల్స్‌కి మంచి జరిగేందుకు అవసరమైతే బీఆర్ఎస్ పార్టీలో చేరుతానని కార్యకర్తల సమావేశంలో సూచనప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఇక నర్సాపూర్ టికెట్ విషయంలో కూడా గాలి అనిల్ కుమార్ తనకు టికెట్ వస్తుందని ఆశించగా రాజిరెడ్డికి టికెట్ కేటాయించడంతో గాంధీభవన్‌కి చేరుకొని.. అనుచరులు కోవర్ట్ హటావో కాంగ్రెస్ బచావో అంటూ నినాదాలు చేశారు. ఓ సందర్భంగా గాలి అనిల్ కుమార్ అనుచరులు పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. పక్కన ఉన్నవారు అప్రమత్తమవడంతో ప్రమాదం తప్పింది. ఇక నాగం జనార్ధన్ రెడ్డి కూడా నాగర్ కర్నూల్ లో తన టికెట్ కేటాయించకపోవడంతో తీవ్ర మనస్థాపన చెందారు.సునీల్ కనుగోలు సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయించామని రేవంత్ తనతో అన్నాడని మరి కొత్తగా వస్తున్న వాళ్లకి టికెట్ ఎలా కేటాయించారని ప్రశ్నించారు. త్వరగా లో నాగం బీఆర్ఎస్ పార్టీలోకి చేరబోతున్నారు. అందుకు సంబంధించి బీఆర్ఎస్ నాయకులతో చర్చలు జరుగుతున్నాయి. యూత్ కాంగ్రెస్‌కి ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడంతో టికెట్టు ఆశించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి కూడా అసంతృప్తిలో ఉన్నారు. యూత్ కాంగ్రెస్ సభ్యులతో గాంధీభవన్‌లో సమావేశం నిర్వహించి రాహుల్ గాంధీ యూత్ కాంగ్రెస్‌కి టికెట్లు కేటాయిస్తామని మాటిచ్చారని ఇప్పటికీ అవకాశం ఉందని రాహుల్‌తో అపాయింట్‌మెంట్ ఫిక్సయినందున ఢిల్లీ వెళ్లి రాహుల్ తో మాట్లాడుస్తానని సభ్యులకు నచ్చజెప్పారు. జడ్చర్ల లేదంటే నారాయణ పేట్ టిక్కెట్ ఆశించిన ఎర్ర శేఖర్, ఎల్లారెడ్డి టిక్కెట్ ఆశించిన సుభాష్ రెడ్డి, నర్సాపూర్ టిక్కెట్ ఆశించిన గాలి అనీల్ అసంతృప్తిలో ఉన్నారు. ఇక హుజురాబాద్ టిక్కెట్ ఆశించిన బల్మూరి వెంకట్, హుస్నాబాద్ టిక్కెట్ ఆశించిన ప్రవీణ్ రెడ్డి, మహబూబాబాద్ టిక్కెట్ ఆశించిన బలరాం నాయక్, బెల్లయ్య నాయక్. పాలకుర్తి టికెట్ ఆశించిన తిరుపతిరెడ్డి, అంబర్‌పేట్ టిక్కెట్ ఆశించిన నూతి శ్రీకాంత్, మోతె రోహిత్, మహేశ్వరం టిక్కెట్ ఆశించిన పారిజాత నర్సింహారెడ్డి, దేవరకొండ టిక్కెట్ ఆశించిన వడ్త్యా రమేష్ నాయక్, మునుగోలు టికెట్ విషయంలో పాల్వాయి స్రవంతి , కృష్ణారెడ్డి అసంతృప్తిలో ఉన్నారు. అసంతృప్తి నేతలతో గాంధీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో గాంధీభవన్‌కి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఏం జరగకపోయినా ఇంకా గాంధీభవన్‌కి నిరసనల సెగ తగిలే అవకాశాలు ఉన్నాయి.

## రేవంత్ రెడ్డి.. రేటెంత రెడ్డి : పైలెట్ రోహిత్ రెడ్డి



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తాండూరులోని రేటెంత రెడ్డి అని శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి ప్రశ్నించారు. తాండూర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లను రేవంత్ రెడ్డి విచ్చలవిడిగా అమ్ముకున్నాడని కోట్లాది రూపాయలకు అమ్ముకున్నాడని ఆయన ఆరోపించారు. అదేవిధంగా అస్మాన్ పేటలో తాండూర్ ప్రాంతాలకు చెందిన వ్యక్తివి రేవంత్ రెడ్డి బినామీ పేర్లతో 1500 గజాల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో రైతులు సుఖంగా ఓ జీవిస్తూ ఉంటే ఓరువలేక కల్లబొల్లి హామీలు, వాగ్దానాలుతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో పేద ప్రజలను మోసం చేయడానికి రైతుల మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు ఉత్తి మాటని ఆయన అన్నారు. రైతుల కోసం 15 వేల రూపాయలను ఇస్తానని అదేవిధంగా 12 వేల రూపాయలను కౌలు రైతులకు ఇస్తానని బోగస్ హామీలు ఇస్తున్నారని అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను ఇబ్బందుల పాలు చేయడానికి ప్రతి తెలంగాణ ప్రజలు అంధకారంలో ఉంచడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గారడి చేస్తుందని మాయమాటలు చెబుతా ఉందని అమలుకాన్ని హామీలు ఇస్తావుందని బిఆర్ఎస్ పాలనలో రైతులు మంచిగా జీవిస్తున్నారని ఎకరానికి 16,000 వరకు ఇవ్వడానికి దశలవారీగా ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అయితే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటలని మాయ చేస్తుందని ఆయన ఆరోపించారు. దాన్ని వచ్చిన తర్వాత రైతులు సుఖంగా ఉన్నారని ప్రశాంతంగా ఉన్నారని రైతుల రికార్డును రైతుల వద్దనే ఉంచినట్లు కంప్యూటర్ లో భద్రంగా ఉందని ఆయన అన్నారు. చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు మాయమాటలు, గారిడి మాటలు చెప్పి ఎన్నికల్లో సీఎం కావడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అధిక సంఖ్యలో ఎమ్మెల్యే సీట్లను కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పదవి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తాండూర్ లో అభివృద్ధికి 1679 కోట్ల రూపాయలు మంజూర్ చేయించే అభివృద్ధి చేయించడం జరిగిందన్నారు. అదేవిధంగా సంక్షేమ రంగంలో 1600 కోట్ల రూపాయలతో సంక్షేమం కోసం ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. నేను స్థానికున్ని తాండూర్ ప్రాంతావాసిని నాకే ఓటు వేసి గెలిపించాలని ఇతర ప్రాంత వాళ్ళు ఓట్ల అప్పుడు మాత్రమే వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు వేసుకొని మారిపోతారని టిఆర్ఎస్ భారత రాష్ట్ర సమితిని అధిక ఓట్లతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు.

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కొనసాగుతున్న హస్తం పార్టీ హవా



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 29 ప్రజాపాలన ప్రతినిధి :బిఆర్ ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులు..సింగిల్ విండో డైరెక్టర్ గంట శ్రీనివాసరెడ్డి వందలాదిమంది కార్యకర్తలు.కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు పలువురు పెద్దలు పాల్గొన్నారు.

## పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన మల్లు నందిని విక్రమార్క



మధిర అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కొరకు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి ఆధ్వర్యంలో పలు చర్చిలలో మల్లు భట్టి విక్రమార్కసతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ లిమల్లు నందిని విక్రమార్కలి రాబోయే ఎన్నికల్లో భట్టి విక్రమార్క విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గురువుల ఆశీర్వాదనాలు పొందడం జరిగిందిఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు అనుబంధ సంఘాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో అన్నదానం



మధిర రూరల్ అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో లడక బజారులో శ్రీ ధర్మశాస్త్ర స్వామి అయ్యప్ప దేవాలయంలో అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో ప్రతిరోజు ఒక దాత సహకారంతో 64 రోజులు మాలాధారుల కు అన్న ప్రసాద వితరణ చేస్తారు ఈరోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించిన వారు శ్రీ తల్లపురెడ్డి వెంకట ఫణి కుమార్ .వారికి వారి కుటుంబానికి శ్రీ స్వామి అయ్యప్ప ఆశీసులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ స్వామి అయ్యప్ప కృపకు పాత్రులు అవుతారని వారు తెలిపారు ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి అయ్యప్ప దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అన్నం పరబ్రహ్మ స్వరూపిణి అన్నదానం చేయటం వల్ల ఆ స్వామి కృపకు పాత్రులు అవుతామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో స్వాముల భక్తులు పాల్గొన్నారు

# మన లక్ష్యం కేటీఆర్ ఓటమి కావాలి

**జాన్సన్ అనేటోడు నాకు తెలువది, కానీ ఆయనను తెచ్చిన కేటీఆర్ ను గోదావరి దాటించాలి**

**రేఖా నాయక్ కు నిధులు ఇవ్వకుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి అవుతుంది**

**కాంగ్రెస్ శ్రేణులంతా ఉమ్మడి కుటుంబ సభ్యులుగా కలిసిపోవాలి**

**అధికారం లో లేకున్నా పార్టీని వదలకుండా ఉన్న మీ అందరి ముఖాల్లో ఆనందం చూడాలి**

**ముఖ్య కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడమ బొజ్జు**




మంచిర్యాల బ్యూరో, ( జన్నారం ) అక్టోబర్ 29, ప్రజా పాలన. అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీని వదలకుండా ఉన్న మీ అందరి ముఖాల్లో ఆనందం చూడాలి, జాన్సన్ అనేటోడు నాకు తెలువది, కానీ ఆయనను మన ప్రాంతానికి తెచ్చిన కేటీఆర్ ను గోదావరి దాటించాలి, మన లక్ష్యం కేటీఆర్ ఓటమి కావాలని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడమ బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన తర్వాత మొదటిసారిగా ఆదివారం జన్నారం మండల కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తొమ్మిదేళ్ల కాలంలో ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని నిర్మల్ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ స్వయంగా పేర్కొన్నాడని గుర్తు చేసిన ఆయన, ఎమ్మెల్యే కు నిధులు కేటాయించకుండా అభివృద్ధి అడ్డుకుని, ఇపుడు అభివృద్ధి జరగలేదని మంత్రి అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖానాపూర్ నియోజకవర్గం లో గత 33 ఏళ్లుగా అధికారంలో లేకుండా ఉన్న కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల్లో ఆనందం వెలువిరిసేలా కార్యకర్తలు సైనికుల్లా గా పనిచేసి పార్టీని గెలిపించుకోవాలని అన్నారు.

**మీ గ్రామాల్లో మీరే ఎమ్మెల్యే...**

ఎన్నికలకు సమయం దగ్గరగా ఉంది, అన్ని గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి హామీ ఇచ్చే అవకాశం లేదు, మీ... మీ గ్రామాల్లో మీరే ఎమ్మెల్యేలుగా ప్రజల సమస్యలు వింటూ పరిష్కారానికి హామీ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఇంటింటికి వెళ్ళండి ప్రజల సమస్యలు వినండి హామీలు ఇవ్వండి అధికారంలోకి వచ్చిన తర్వాత మీ గ్రామ సమస్యలను మీ ద్వారానే పరిష్కరించబడతాయని, అందుకోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని పేర్కొన్నాడు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంతా ఉమ్మడి కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉండాలని, పార్టీలోకి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాల ప్రజలను సాధారణంగా ఆహ్వానించాలని పేర్కొన్నారు.

**మండల కేంద్రంలో ఘనస్వాగతం.**

ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన తర్వాత మొదటి సారిగా మండల కేంద్రానికి వచ్చిన ఆయన కు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఇందన్ పల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాయకులు , కార్యకర్తలు భారీ ఎత్తున బైక్ ర్యాలీతో జన్నారం చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి, జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీఖాన్ . మేకల మాణిక్యం , సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి. సయ్యద్ ఇసాక్. మచ్చ శంకరయ్య. మోహన్ రెడ్డి. మిక్కినేని రాజశేఖర్. యాదగిరి కమలాకర్ రావు. ముత్యం రాజన్న. మాజీ జెడ్పిటిసి పంకజ. బాదావత్ సుధాకర్ నాయక్. కంటెం శంకర్. ఎంపీటీసీలు దాముక కమలాకర్. పడాయి హనుమంత్ సర్పంచులు ఆరే శిరీష్ కుమార్. కోల పద్మారావు. సునర్కర్ లక్ష్మణ్. ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి షోహేల్ షా . హేమంత్ చారి. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నందు నాయక్. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదం రాకేష్. మండల నాయకులు సయ్యద్ పసిఉల్లా .దుర్గం లక్ష్మీనారాయణ. రియాసాత్ అలీ. సయ్యద్ ఇబ్రహీం. వసీం పటేల్. జాడి రాజేశ్వర్. లకావత్ నందు నాయక్. అల్లం వెంకట్ రాజం. అంబటి పెల్లి నరసయ్య. చుంచు నరసయ్య. గాజుల సత్తన్న. కస్తూరి భూమన్న. భీమినేని రాజన్న. యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్. సాగర్ గౌడ్. రాహుల్ . కోల మహిపాల్. వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను గడప గడపకు స్వాగతిస్తున్న గ్రామస్తులు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 29 ప్రజాపాలన ప్రతినిధి: లోయపల్లిలో దుమ్ము రేపిన ప్రజా ఆశీర్వాద సభ...బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ అధ్యక్షతన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని లోయపల్లి గ్రామంలో ప్రజా ఆశీర్వాద సభ ధూమ్ ధామ్ గా జరిగింది.పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వం ద్వారా గ్రామంలో జరిగిన అభివృద్ధిని, పొందిన లబ్దిని గుర్తు చేసి రానున్న రోజుల్లో చేసే పనులను కూడా చెప్పారు.ప్రజలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని మళ్ళీ గెలిపిస్తామని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య ఎంపీపీ నర్మదా లచ్చిరాం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బహదూర్ నాయక్ పిఎసిఎస్ చైర్మన్ బుసు పుల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారీ యాదయ్య ఎంపీటీసీ అనిత వెంకటేష్ సర్పంచులు రఘునాయక్ పెంట్యా నాయక్ యువజన విద్యార్థి సంఘాల అధ్యక్షులు వనపర్తి బద్రీనాథ్ గుప్తా ఆంబోతు ప్రవీణ్ నాయక్ నాయకులు చిందం రఘుపతి నర్సింగ్ వెంకటేష్ గౌడ్ రామ్ రెడ్డి స్థానిక నాయకులు గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పాలకుల జానయ్య, రమేష్, సీనియర్ నాయకులు ఉయ్యాల కృష్ణ సదానందం, ధనుంజయ, పివి గౌడ్ గణేష్, రావుల శంకర్, నారి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి ముస్లిం ఐక్య సంఘం ఆవిష్కరణ



మధిర రూరల్ అక్టోబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానికవ్యవసాయ మార్కెట్ యార్డు జనాబ్ మౌలానా షేక్ ముజాహిద్ అధ్యక్షతన ముస్లిం ఐక్య సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధిర నియోజకవర్గస్థాయి ముస్లిం ఐక్య సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులుగా జనాబ్ మౌలానా షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులుగా జనాబ్ షేక్ హుస్సేన్, జనరల్ సెక్రటరీగా జనాబ్ షేక్ అబ్దుల్ మజీద్, ట్రెజరర్ గా జనాబ్ షేక్ మొహమ్మద్ గౌసుద్దీన్, జాయింట్ సెక్రటరీగా జనాబ్ సయ్యద్ కరీం ఎన్నుకొనడం జరిగింది అదేవిధంగా బోనకల్ మండల కమిటీ అధ్యక్షులుగా జనాబ్ షేక్ మహబూబ్ పాషా, కార్యదర్శిగా జనాబ్ షేక్ షాజహాన్ మరియు ఇతర సభ్యులను ఎన్నుకొనడం జరిగింది. ఎర్రుపాలెం మండలం కమిటీ అధ్యక్షులుగా జనాబ్ షేక్ బాసిత్ అలీ, కార్యదర్శిగా జనాబ్ షేక్ రఫీ గార్లను మరియు ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా మధిర మండల కమిటీ అధ్యక్షుడిగా జనాభా షేక్ గాలి, ఉపాధ్యక్షులుగా జనాబ్ ఎండి జమీర్, కార్యదర్శిగా జనాబ్ ఎస్ కే సైదులు మరియు ఇతర సభ్యులను ఎన్నుకొనుట జరిగినది. ఈ సమావేశంలో సంఘం యొక్క నామకరణమైన ముస్లిం ఐక్య సంఘం అనే పేరును మరియు సంఘం యొక్క లోగోను ఆవి పలువురు పాల్గొన్నారు

## ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



వేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి): ఉప్పల్ నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యంగా మెరుపు వేగంతో దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ నియోజకవర్గంలోని డా.ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ లో ప్రతీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ, ఆత్మీయంగా అందర్నీ కలుస్తూ, ఓటర్ల సంపూర్ణ మద్దతు కూడగట్టుకుంటూ, కార్యకర్తల్ని కలుపుకుపోతూ లక్ష్మారెడ్డి భారీగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో బండారి లక్ష్మారెడ్డికి ఓటర్లు బ్రహ్మరథం పడుతూ, శాలువాలతో సత్కరిస్తూ, మహిళా ఓటర్లు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలిపారు. కాంగ్రెస్, బిజెపి నాయకులు చెప్పే మాయమాటలు నమ్మే పరిస్థితిలో తాము లేమని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రజలకు భరోసా ఇస్తున్న కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఉప్పల్ నియోజకవర్గం నుండి బలమైన నాయకుడు బండారి లక్ష్మారెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించుకుంటామని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ ఎంబీసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావని రెడ్డి,, డివిజన్ ప్రసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, మనేమ్మ, మహిళా ప్రసిడెంట్ శిరీష రెడ్డి, రహీమ్, పలువురు డివిజన్ ముఖ్య నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జోరందుకున్న కాంగ్రెస్ ప్రచారం



చేవెళ్ల అక్టోబర్ 29,(ప్రజాపాలన):- చేవెళ్ల నియోజవర్గ,మండల కేంద్రంలోని దేవుని ఎర్రవల్లి, ఊరెళ్ళ అనుబంధ గ్రామమైన మొందడివాగు , మల్క్ పూర్, కుమ్మెర ,రావులపల్లీ ఖుర్ధు, ముడిమ్యల గ్రామాలలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామేన భీమ్ భరత్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు తిరిగి, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టబోయే 6 గ్యారంటీ పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోట్లాది తెచ్చుకున్న తెలంగాణను రాష్ట్ర సీఎం సీఎం కెసిఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేశారని. ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు భూమిలేని వారికి మూడెకరాల భూమి, దళిత బంధు బిసి బంధు అంటూ ఒక మాయమాటలతో, కాలక్షేపం చేస్తున్నారని, యువతకు ఉద్యోగలు ఇస్తామని, యువతను ,అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని , అరాచక పాలనను అంతమొందించే సమయం ఆసన్నమైందని, రాష్ట్రంలో కెసిఆర్ , చేవెళ్లలో కాలే యాదయ్య కుటుంబం వారి పదవులు అనుభవిస్తున్నారని. వీరికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని అన్నరు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.శంకర్పల్లి మండలంలోని, బుల్కాపూర్గ్రామానికి చెందిన గ్రామస్తులు మాజీ సర్పంచ్ అధ్వర్యంలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీచింపుల సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ శైలజ అగిరెడ్డి, దేవర వెంకటరెడ్డి,గోనె ప్రతాప్ రెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటరెడ్డి,పెంటయ్య గౌడ్, మద్దేల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, పడాల ప్రభాకర్, సూర్యాపేట శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ యాదయ్య ,కుమార్ హరీశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ,టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మల దేవేందర్, యాదిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## బండారి లక్ష్మారెడ్డికి చిలుకానగర్ కూరగాయల కమిటీ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు



మేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి):బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరేల్లి రవీందర్ రెడ్డిల ఆధ్వర్యంలో చిలుకానగర్ డివిజన్లోని కూరగాయల కమిటీ అసోసియేషన్ వారు ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సేవ గుణాలు తెలుసుకొని స్వచ్ఛందంగా బీఎల్ఆర్ పేరుతో ఐడి కార్డులు తీసుకొని కూరగాయల మార్కెట్ కుటుంబ సభ్యులందరూ బండారి లక్ష్మారెడ్డి వెంబడి ఉన్నామని మా సంపూర్ణమైన మద్దతు ఇస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మార్కెట్ సభ్యులందరూ బండారి లక్ష్మారెడ్డికి పులబోకె అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర నాయకులు తాడూరి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి , నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్, చిల్కానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు మోట్టే రమేష్, కొంపల్లి రవీందర్ ముదిరాజ్, ముక్కాల రామకృష్ణ, కొంపల్లి రాజకుమార్, మాజీ అధ్యక్షుడు చేర్యాల శ్రీనివాస్, మహమ్మద్ పాన్ షాప్, పాపగారి వెంకట్ రెడ్డి, భూపతి, నరసింహ ముదిరాజ్, సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.సండే మార్కెట్ కూరగాయల కమిటీ అసోసియేషన్ మెంబర్స్ అధ్యక్షులు గణేష్ ,ఉపాధ్యక్షులు లింగయ్య ,ప్రధాన కార్యదర్శి రాజేష్ ,రవి, నాగరాజు, కనకయ్య, ఎల్లయ్య, విజయ్ కుమార్, బిక్షపతి,లక్ష్మి, రమ, రాజ్యలక్ష్మి, పద్మ, పద్మ అండాలు, మంగమ్మ, కూరల కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

## విశ్వకర్మ మహాజన బహిరంగ సభను విజయవంతం చేయండి



మేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి):విశ్వబ్రాహ్మణుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నవంబర్ 5వ తేదీన హైదరాబాద్ ఉప్పల్ భగాయత్ లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన స్థల ప్రాంగణంలో తలపెట్టిన బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల విశ్వబ్రాహ్మణ సోదర, సోదరీమణులు తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వకర్మ మహాజన బహిరంగ సభ ఆహ్వాన కమిటీ చైర్మన్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షులు వేములవాడ మధన్ మోహన్ ఆచార్య, ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి విష్ణుచారి పిలుపునిచ్చారు. రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీ కమిటీ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో బహిరంగ సభ ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల కోసం రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి వచ్చే ప్రభుత్వం అమలు చేయవలసిన డిమాండ్లను వారు వివరించారు. విశ్వబ్రాహ్మణుల కోసం 1,000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు, 50 సంవత్సరాలు నిండిన విశ్వబ్రాహ్మణులకు 5 వేలు పెన్షన్ వర్తింపు, స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు, అక్రమ రికవరీలను వెంటనే అరికట్టాలని, ప్రమాదవశాత్తు మరణించిన విశ్వబ్రాహ్మణ చేతివృత్తుల వారికి పది లక్షలు ఎక్స్గ్రేషియా అమలు చేయాలని, పావల వడ్డీ రుణాలు తదితర డిమాండ్లను అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బహిరంగ సభ గౌరవ అధ్యక్షులు వింజమూరి రాఘవచారి, ఉపాధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాసచారి, నాగారం భాస్కరాచారి, పబ్బోజు బిక్షపతి, కె శశిధర్ శిల్పి, తాటికొండ శ్రీరాములు, పానుగంటి లక్ష్మణాచారి, జగ్జీవన్ చారి, బ్రహ్మాచారి, సత్యంచారి, సోమాచారి, దానకర్ణాచారి, నర్సింహ చారి, కార్యదర్శులు గుంటోజు భీష్మాచారి, సేరోజు రవిచారి తదితరులు పాల్గొన్నారు.

## చామకూర మల్లారెడ్డి గెలుపు కోసం కార్పొరేటర్ యుగంధర్ రెడ్డి ప్రచారం



మేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి): చామకూరు మల్లారెడ్డి గెలుపు కోసం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ 11వ డివిజన్ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డివిజన్లో ఇంటింటా తిరుగుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ, బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి, చామకూర మల్లారెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్పొరేటర్ యుగేందర్ రెడ్డి కోరుతున్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

**సంపాదకీయం**

**సోమవారం 30,అక్టోబరు 2023**

## మానవతను మంటగలుపుతున్న యుద్ధాలు

జీవకోటిలో మానవుడు సర్వోన్నత సమున్నతుడు. నిప్పు ఉపయోగించడం తెలుసుకున్నప్పటి నుంచీ మానవ మేధ పరుగులు తీసింది. అణువును శోధించింది. బ్రహ్మాండాన్ని అన్వేషించింది. ఇప్పుడు మనిషి గ్రహాంతర వలసలకు సిద్ధమవుతున్నాడు. అయినా వేల వేల సంవత్సరాల క్రితం నాటి నియాండర్థల్ మానవుల కంటే మనం భిన్నంగా ప్రవర్తిస్తున్నామా? ఆ మన పురాతన పూర్వీకుల పోరాటాలు నియమరహితంగా ఉండేవి. మనం ఎటువంటి నిబంధనలను పాటించకుండా, పైగా అనవసర, న్యాయవిరుద్ధ యుద్ధాలు చేస్తున్నాం.మానవ చరిత్రలో ఏనాడైనా యుద్ధ కార్యకలాపాలకు నిర్దిష్ట నియమాలు ఉన్నాయా? ఉన్నాయి. క్రీ.శ. 200లో నెట్టి మయ్యార్ తన పద్యాలలో, తమిళ భూపాలురు తమ మధ్య యుద్ధాలలో పాటించే నైతిక ప్రమాణాలను పేర్కొన్నాడు. సమరాంగణ చక్రవర్తి ఒకడు యుద్ధానికి సంసిద్ధమవుతూ తన ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేశాడో చూడండి: 'గోవులు, గౌరవనీయ పూజారులు, మహిళలు, అనారోగ్య పీడితులు, అంత్యక్రియలు నిర్వహించేందుకు పిల్లలు లేనివారు సత్వరమే తమ సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి.' సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సైనికులు యుద్ధ క్షేత్రంలో చెలరేగిపోయేవారు. ఆ తరువాత తమ గుడారాలకు వెళ్లి విశ్రాంతి తీసుకునేవారు మరుసటి ఉదయం మళ్లీ సమర భూమికి వచ్చేవారు. రావణుడిపై యుద్ధంలో రాముడు ఎంత మానవీయంగా ప్రవర్తించాడో తమిళ కవి శేఖరుడు కంబన్ ఇలా పేర్కొన్నాడు: "లంకాధీశుడు అలసిపోయాడు. పోరాడలేక పోతున్నాడు. అతడిని చూసి రాముడు జాలిపడ్డాడు. 'ఈ రోజుకు ఇక చాలు. మీ సౌధానికి వెళ్లి పోండి. రేపు ఉదయం మళ్లీ యుద్ధానికి రండి' ". యుద్ధాలు నాగరీక చర్యలే అయితే పురాతన కాలంలో సమరాలు నిజంగా నాగరీక కార్యకలాపాలే. న్యాయ నియమాల ప్రకారమే ఆ పోరాటాలు జరిగేవి. మరి ఆధునిక యుగంలో..? మానవతను మరచిన ఘర్షణలు. ఇక ప్రస్తుత కాలంలో మన కళ్ల ముందు జరుగుతున్న యుద్ధాల గురించి చెప్పేదేముంది? రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య, ఇజ్రాయిల్, హమాస్ మధ్య కొనసాగుతున్న యుద్ధాలను ఏమనాలి? అవి పాశవికమైనవి, క్రూరమైనవి, దుర్మార్గమైనవి. విచక్షణారహితంగా బాంబుల వర్షం కురిపిస్తున్నారు. అటు ఉక్రెయిన్‌లోను, ఇటు గాజాలోను నగరాలకు నగరాలు, పట్టణాలకు పట్టణాలు బూడిద కుప్పలు అవుతున్నాయి. ఆస్పత్రులు, విద్యాలయాలు ధ్వంసమవుతున్నాయి. బాలలు, మహిళలు, వృద్ధులు, రోగగ్రస్తులతో సహా వేలాది అమాయకులు చనిపోతున్నారు. చనిపోనివారు సొంత దేశంలోనే నిర్వాసితులు అవుతున్నారు. ఎటువంటి ప్రాథమిక సదుపాయాలు లేని సహాయ శిబిరాలలో ఎంతో మంది తలదాచుకోవలసివస్తోంది. నిరాశ్రయులయినవారు ఇరుగు పొరుగు దేశాలకు కాందిశీకులుగా వలసపోతున్నారు. అరకొరగా తాగునీటి సరఫరా. విద్యుత్ వెలుగులు అసలే కానరావు ఆహార పంపిణీకి అనేక అవాంతరాలు. మందులు, మాకుల గురించి మాట్లాడకపోవడమే మంచిది. సహాయ సామగ్రిని రవాణా చేస్తున్న ట్రక్కులు మైలు మైలుకు గంటలపాటు నిలిచిపోతుంటాయి.ఎందుకు జరుగుతున్నాయి ఈ యుద్ధాలు? రష్యా%--%ఉక్రెయిన్ యుద్ధానికి కారణం ఆధిపత్యం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి చరిత్రలోకి వెళదాం. ఉక్రెయిన్ 1922 నుంచి 1991 వరకు సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉండేది. రష్యన్ జాతీయులు ఎంతో మంది ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఆ ప్రదేశాలలో వారిదే పూర్తి పెత్తనం. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. నాటి నుంచి నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) కూటమి దేశాలకు, రష్యాకు మధ్య నడి కాపు (బఫర్) దేశంగా ఉక్రెయిన్ కొనసాగుతుండేది. ఉక్రెయిన్ కనుక నాటో కూటమిలో చేరితే ఆ కూటమి సైనిక దళాలు తన సరిహద్దుల వద్దకు చేరుతాయని రష్యా భయపడింది. ఉక్రెయిన్ ఎట్టి పరిస్థితులలోనూ తటస్థ దేశంగా ఉండిపోవాలని రష్యా కోరుకుంది. అంతేకాకుండా ఉక్రెయిన్‌లో రష్యన్ జాతీయులు స్థిరపడిన ప్రాంతాలను తమ దేశంలో కలుపుకోవాలని మాస్కో పాలకులు అభిలషించారు. అయితే పరిస్థితులు అందుకు విరుద్ధంగా పరిణమించాయి. పశ్చిమాసియాను అతలా కుతలం చేస్తున్న ఇజ్రాయిల్–హమాస్ యుద్ధంలో కూడా భూభాగాల ఆక్రమణ ప్రధాన సమస్య. పాలస్తీనియన్లు అందరూ –వీరిలో కొందరికి హమాస్ ప్రాతినిధ్యం వహిస్తోంది– యూదులు తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని విశ్వసిస్తున్నారు. ఆ వివాదాస్పద భూమే పాలస్తీనా. ఒకప్పుడు అక్కడ అరబ్‌లు, యూదులు, క్రైస్తవులు కలసిమెలసి జీవించేవారు. అయితే ఐక్యరాజ్యసమితి నిర్ణయం మేరకు 1948లో ఇజ్రాయిల్ ఉనికిలోకి వచ్చింది. తదాది ప్రపంచంలోని ఎక్కడెక్కడి యూదులు అక్కడకు వచ్చి స్థిరపడుతున్నారు. ఆధునిక ఇజ్రాయిల్ ఒక శక్తిమంతమైన దేశం. పరమ శత్రువులయిన ఇరుగు పొరుగు దేశాలన్నిటినీ సమర్థంగా ఎదుర్కొని నిలబడిన దేశమది. పశ్చిమాసియాలో ఏకైక అణ్వస్త్ర రాజ్యమది. చరిత్ర పాలస్తీనీయన్ల పక్షాన ఉండవచ్చును కానీ యథార్థమేమిటంటే ఈ ధరిత్రి నుంచి ఇజ్రాయిల్ రాజ్యాన్ని ఎవరూ పూర్తిగా తుడిచిపెట్టలేరు.ఐక్యరాజ్యసమితి ఒక కీలక అంతర్జాతీయ సంస్థ అయితే అది ఒక దుర్బల సంస్థ. తన లక్ష్యాలను సంపూర్ణంగా ఆచరణలో పెట్టలేని బలహీన సంస్థ. 'ప్రపంచ దేశాల సమైక్య ప్రజలమైన మేము భావి తరాలను యుద్ధాల నుంచి కాపాడేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. మన జీవిత కాలంలోనే యుద్ధం రెండుసార్లు సమస్త ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఇక ముందు సాయుధ బలగాలను వినియోగించ నవసరంలేని పరిస్థితులను సృష్టించడమే మా లక్ష్యం' అని ఐక్యరాజ్యసమితి అధికార పత్రం గంభీరంగా ఉద్ఘాటించింది. యుద్ధాలను నివారించి ప్రపంచ శాంతిని కాపాడడంలో ఐక్యరాజ్యమితి ఘోరంగా విఫలమయింది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే అసలు యుద్ధ స్వభావమే పూర్తిగా మారిపోయింది. ఒక మనిషితో మరొక మనిషి బాహాబాహీగా పోరాడడమనేది ఒకనాటి యుద్ధ తంత్రం. ఇప్పుడు యంత్రాలు యంత్రాలతో పోరాడుతున్నాయి. క్షిపణులపై డ్రోన్‌లు పోరాడుతున్నాయి. క్షిపణులు క్షిపణి నిరోధకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. దేశాల మధ్య భూ సంబంధ వివాదాలను పరిష్కరించే మార్గాలను ప్రపంచ దేశాలు కనుగొనలేకపోతే యుద్ధాలు అనివార్యమవుతాయి. భారత్, పాకిస్థాన్ మధ్య వివాదం భూ సంబంధమైనది. కరడుగట్టిన మితవాదులు ఈ వివాదాన్ని హిందూ ఇండియా, ఇస్లామిక్ పాకిస్థాన్ మధ్య ఘర్షణగా చిత్రిస్తున్నారు. ఇదొక హానికరమైన సిద్ధాంతం. దేశ విభజనను, స్వాతంత్ర్య చట్టాలను రెండు దేశాలు అంగీకరించాయి. పాకిస్థాన్ దురాశ కారణంగానే భూ వివాదం నెలకొని ఎడతెగని ఘర్షణలకు కారణమవుతోంది. అలాగే భారత్– చైనాల మధ్య వివాదం కూడా భూ సంబంధమైనదే. వలసపాలన కాలంలో రెండు దేశాల మధ్య సరిహద్దులను సరిగ్గా నిర్ణయించకపోవడమే ఈ వివాదానికి దారి తీసింది. సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాలపై తమకే హక్కు ఉన్నదని భారత్, చైనాలు ఘర్షించుకుంటున్నాయి. పరిష్కారమేమిటి? చర్చలే గాని యుద్ధం కానేకాదు. ప్రధాని మోదీ అన్నట్టు 'ఇది యుద్ధాల యుగం కాదు'.

# కేంద్రీకృత వ్యూహంతో బిజెపి త్రిముఖ దాడి



అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వీస్తున్న ఎదురు గాలిని తట్టుకోవడానికి బిజెపి అగ్ర నాయకత్వం, ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్ షా వేస్తున్న ఎత్తులు పైఎత్తులు అభాసుపాలవుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటించిన తతంగాలు చావ చుట్టుకోవలసి వస్తున్నది. ప్రతిపక్షాల నుంచే గాక రాజ్యాంగ నిపుణుల నుంచి, మీడియా నుంచి విమర్శలు రావడంతో అనివార్యంగా వెనక్కు తగ్గవలసి వస్తున్నది. జమిలి ఎన్నికల నినాదం ఆ ఎత్తుగడలకు పరాకాష్టగానే రూపు దిద్దుకుంది. డబుల్ ఇంజన్ హడావుడి కూడా అదే. కేంద్రంలోని మోడీనే రాష్ట్రాలలో ఊరేగించి ఒకేసారి రాష్ట్రాలనూ కైవశం చేసుకోవచ్చనే అప్రజాస్వామిక ఆలోచన దీని వెనక వుందని అందరికీ అర్థమైపోయింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే రేషన్, ఒకే మతం... అన్న చందంగా చేసే రాజకీయమే దేశభక్తిగా చలామణి చేయడం ఎంతో కాలం చెల్లదని ఒప్పుకోవలసి వచ్చింది. జమిలి ఎన్నికలను రుద్దడం తేలిక కాదనీ పైగా ఈ సమయంలో వ్యతిరేకత కూడా తెచ్చిపెట్టవచ్చని గ్రహించిన తర్వాత ప్రస్తుతానికి కేంద్రం వెనక్కు తగ్గింది. అయితే మరోవైపున ఇందుకోసమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన అధ్యయన కమిటీ నియమితమైంది. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండానే కేవలం మోడీ కనుసన్నలలో పూర్తయిన కొత్త పార్లమెంటు భవనంలో దీన్ని ఆమోదించడం ఆసక్తికరం. మోడీ విధేయత కారణంగా గతంలో రాష్ట్రపతి పదవి పొందిన కోవింద్‌నే మళ్లీ తెరపైకి తేవడం యాదృచ్ఛికం కాదు. వాస్తవానికి పదవీ విమరణ చేసిన ఒక రాష్ట్రపతికి అధికారిక బాధ్యత అప్పగించడం ఇదే ప్రథమం. కేంద్ర ప్రభుత్వ అధికారులను కమల ప్రచారకులుగా వాడుకోవడం కోసం ఉద్దేశించిన 'రథ్ ప్రభారీ' ప్రహసనం ఆ విధంగానే విమర్శల పాలైంది. కేంద్ర పథకాల ప్రచారమంటూ అధికారులను స్వంత పార్టీ సైన్యంగా మార్చేసుకుని ఆ ముసుగులోనే పార్టీ ప్రచారం చేయించుకోవడానికి పెట్టుకున్న 'రథ్ ప్రభారీ' పేరును చల్లగా మార్చుకోవలసి వచ్చింది. ఎన్నికల కమిషన్ నోటీసుతో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలలోనూ ఈ కార్యక్రమం వుండబోదనే ప్రకటనా చేయవలసి వచ్చింది. అయితే ప్రధాని దీన్ని ప్రారంభించడం, దేశ వ్యాపితంగా ఈ ప్రచార ప్రహసనం యథా విధంగా కొనసాగుతుంది. అంటే మౌలికంగా మోడీ ఆలోచనా ధోరణిలో గానీ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలలోగానీ మార్పు లేదని స్పష్టమవుతుంది.

**రాముడి ఆశీస్సులు ఆయనకేనా?**

అయిదు రాష్ట్రాల ఎన్నికలలో బలాబలాలను బట్టి, రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే బిజెపికి పెద్ద అనుకూలత లేదని చాలా చోట్ల ఓడిపోవచ్చునీ సర్వేలు చెబుతున్నాయి. మూడు హిందీ రాష్ట్రాలలో పాతవారిని కొనసాగించలేని, ప్రస్తుతమున్న వారిని కొనసాగించలేని స్థితిలో బిజెపి వుంది. ఈ సంకట స్థితిని అధిగమించడానికి రామభక్తి నుంచి రాజకీయ కుయుక్తుల వరకూ దేనికీ వెనకాడటం లేదు. అయోధ్య పరిణామాలు, సుప్రీంకోర్టు తీర్పు...తదితర అంశాలు మళ్లీ ముందుకొచ్చాయి. 2019 ఎన్నికలు ముగియగానే అయోధ్యలో భూమి పూజలో ప్రధాని మోడీ ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా అయోధ్య ట్రస్టు ప్రతినిధులు మోడీని కలిసి 2024 జనవరిలో విగ్రహ మహా ప్రతిష్టాపనకు హాజరు కావలసిందిగా ఆహ్వానం అందించారు. ఆయన దాన్ని మీడియాలో పెద్ద విషయంగానే ప్రచారంలో పెట్టారు. బిజెపి మిత్రపక్షంగా దీర్ఘకాలం కొనసాగడమే గాక అయోధ్య ఘటనలలోనూ ఆరోపణలకు గురైన మహారాష్ట్ర శివసేన ఉద్ధవ్ థాకరే వర్గం ఎం.పి సంజరు రౌత్ దీనిపై స్పందిస్తూ 'రాముడు బిజెపికి, మోడీకి మాత్రమే సంబంధించిన దేవుడు కాదు కదా...' అని ఆక్షేపించారు. అయోధ్య ఆలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్‌కు ఇది చాలా కోపం తెప్పించింది. ప్రధా ని గనక పిలిచా మంటే అదోరకంగా వుండేది. మోడీకి రాముడి ఆశీస్సులున్నాయి గనకే దేశాధినేతగా అధికారం చలాయించగలుగుతున్నారని, మిగిలిన వాళ్లు వీధుల్లో తిరుగుతున్నారని ఫక్తు రాజకీయ వాదన చేశారు. మరో విధంగా చెప్పాలంటే రాముడి ఆశీస్సులు ఆయనకే వున్నాయని కితాబిచ్చారన్నమాట. అయోధ్యలో భూ మాఫియా పెరిగి కబ్జాలు, దౌర్జన్యాలు చేస్తున్నారనే వార్తలు వస్తుంటే, ఒక పూజారి కూడా వారి చేతుల్లో ఈ మధ్యనే హత్యకు గురైతే ఇంతవరకు అతీగతీ లేదు. ఈ సమయంలోనే వారణాసిలో జ్ఞానవాపి మసీదు, బృందావన్ లో కృష్ణమందిరం సమస్యలను కోర్టుల్లో తిరిగి తీసుకురావడం కూడా ఈ మత రాజకీయంలో భాగమే. ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రావణ దహనంలో పాల్గొంటూ మోడీ పరోక్షంగా ఎవరైతే కుల గణన పేరిట ప్రజల్లో చీలికలు తెస్తున్నారో వారిని కూడా ఇలాగే దహనం చేయాలని తీవ్రమైన మాటన్నారు. 'ఇండియా' వేదికను దృష్టిలో పెట్టుకునే ప్రధాని ఇంత మాటన్నారని మీడియా పోల్చి రాసింది.

**మార్క్సిస్టులపై దాడి, నచ్చిందే చరిత్ర!**

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ సంప్రదాయికంగా చేసే దసరా ప్రసంగంలో ఇంచుమించు ఇదే సెలవిచ్చారు. సాంస్కృతిక మార్క్సిస్టులను, వోక్ పీపుల్ (మేల్కొల్పు జనాభా)ను తోసిపుచ్చాలని భగవత్ ఉవాచ. కొన్నేళ్ల కిందట మోడీ లోక్‌సభలో ఆందోళన జీవులంటూ అపహాస్యం చేయడం గుర్తుండే వుంటుంది. ఈ మాటలన్నీ కూడా చైతన్యం, కదలిక తీసుకొచ్చే వారిపైన ఎక్కుపెట్టబడిన ఆయుధాలే. పశ్చిమ దేశాల్లో విముక్తి కోసం పోరాడేవారిని వోక్ పీపుల్ అంటుంటారట. దేశంలో సమస్త అనర్థాలకూ వారే మూల కారణమని మోహన్ భగవత్ ప్రకటించారు. వీరు ప్రజల్లో అసంతృప్తి పెంచుతారట, చీలికలు తెస్తారట, ఆఖరుకు మణిపూర్‌లో కూడా వీరి వల్లనే కుకీ, మైతేయిల మధ్య తగాదా వచ్చిందట. ఈ దేశంలో వున్నవారంతా హిందువులేనని ప్రకటించిన సర్ సంఘ్‌చాలక్ నోట ఈ మాటలు రావడం దేనికి నిదర్శనం? సనాతన ధర్మమే శరణ్యమనే సంఘపరివార్ భావమే అది. అల్ప సంఖ్యాకులు, అణగారిన వర్గాలు, మహిళలు నోరు మూసుకుని పడుంటే ఏ గొడవలు రావని తాత్పర్యం. రాజ్యాంగం మొదటి అధికరణమే చెబుతున్నట్టు 'ఇండియా దటీజ్ భారత్'గా గాక ఈ దేశాన్ని భారత్ అనే పిలవాలని తీర్మానించడం కూడా ఈ మహా పథకంలో భాగం. ఇండియా పేరుతో పాటు దాని చరిత్రనూ మార్చడం దాని కార్యాచరణ రూపం. జరిగిన చరిత్రను మరింత శాస్త్రీయంగా ప్రామాణికంగా పరిశోధించి భావితరాలకు అందించడం గాక హిందూ రాజులను కీర్తించే విధంగా చరిత్ర పాఠాలుండాలని, మొఘల్ చరిత్ర తీసేయాలనీ ఎన్‌సిఇఆర్‌టి చెప్పడమూ అందుకే. అంతేనా? చరిత్రకూ పురాణాలకూ మధ్య తేడా చెరిపెయ్యాలి. చంద్రయాన్ పాఠంతో పాటు ప్రాచీన కాలంలోనే మనవాళ్లు ఆకాశ విహారం చేశారనీ పుష్పక విమానం వుండేదనీ చెప్పాలని ఎన్‌సిఇఆర్‌టి ఆదేశం. ఇదే సమయంలో నిజమైన చరిత్రలో అవసరమైన అంశాలు తెలియకుండా చేయడం కోసం గాంధీజీ హత్య, గుజరాత్ మత హత్యాకాండ వంటివి తీసేయాలి. ఇవి అమలులోకి రావడం తర్వాత జరిగినా ముందు ఈ వార్తలు విడుదల చేయడం ద్వారా మత చాందసాలను సంతృప్తి పరచాలి. అయితే విద్యారంగం ఉమ్మడి జాబితాలో వుంది గనక, పాఠ్యాంశాల పరంగా నిర్ణయాలు రాష్ట్రాలు తీసుకుంటాయి గనక కొత్త విధానం వాటిపై రుద్దడం జరుగుతున్నది. కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి రాష్ట్రాలు ఇందుకు గట్టిగా నిరాకరించినా ఎ.పి తో సహా పలు రాష్ట్రాలు అత్యుత్సాహంగా అమలు చేయడం ఆందోళన కలిగించే వాస్తవం. సహకార రంగం తమ అదుపులోకి తెచ్చుకోవడానికి అడుగులు వేస్తున్నారు. పర్యాటక రంగం కూడా తమ అధీనంలోకి తీసుకుంటున్నారు.

**రాష్ట్రాలపై ఆర్థిక బిగింపు**

ఈ ఏకపక్ష కేంద్రీకృత, రాజకీయ సాంస్కృతిక ఆధిపత్య ధోరణిని చలాయించడం కోసం మరింత వేగంగా ఆర్థిక కేంద్రీకరణ తీసుకొస్తున్నారు. పరిమిత అధికారాలు గల ఢిల్లీ రాష్ట్ర నమూనా ఇందుకు ఆదర్శంగా కనిపిస్తున్నది. సుప్రీంకోర్టులోనే ఇందుకు వ్యతిరేకంగా తీర్పు రాగా రాజ్యాంగ సవరణతో తోసిపుచ్చి సర్వాధికారాలు చేజిక్కించుకుంది కేంద్రం. ఉప ముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర నేతలను ఖైదు చేసి అడుగడుగునా ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డు తగులుతున్నది. జమ్మూ కాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడంలో మతతత్వ రాజకీయమూ కేంద్ర పెత్తనమూ రెండూ వున్నాయి. అసలు స్వాతంత్ర్యానంతరం ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం ఇదే ప్రథమం. రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకుండా పరాధీనతలోకి నెట్టడం, నిధులు కేటాయించకపోవడం నిరంతర ప్రహసనంగా మారింది. ఎ.పి, తెలంగాణల అనుభవమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేరళ నిరంతరం దీనిపై పోరాడుతూనే వుంది. నిధులు ఇవ్వకపోవడం, తెచ్చుకునే అప్పులపై ఆంక్షలు పెట్టడం రాష్ట్రాలను అడకత్తెరలోకి నెడుతున్నది. అప్పులు పెరిగాయని మళ్లీ ఆ బిజెపి నేతలే గగ్గోలు మొదలెడతారు. రాష్ట్రాల వాటా తేల్చే ఫైనాన్స్ కమిషన్ పరిధినే తగ్గించడంతో పాటు చేసిన సిఫార్సులనూ కేంద్రం తొక్కిపడుతుంది. జిఎస్‌టి కారణంగా పెట్రోలు, డీజిల్ తప్ప మరేవీ రాష్ట్రాలకు అందకుండా పోయాయి. మిగిలిన మేరకైనా రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా సెస్సులు, సర్ చార్జిలను పెంచి వాటికి వాటా లేకుండా చేస్తారు. రాష్ట్రాలపై శత్రుపూరితంగా దుష్ప్రచారం చేస్తారు. బీహార్‌లో ఎఐఐఎంఎస్ పెట్టడానికి రాష్ట్రాలు సరైన స్థలం చూపించలేదని తెలంగాణలో కిషన్‌రెడ్డి, బీహార్‌లో మన్సుఖ్ మాండవీయ ఒకే విధమైన ఆరోపణలు చేస్తారు. రైల్వేలకు కేరళ సహకరించలేదని మంత్రి అశ్వనీ వైష్ణవ్, కర్ణాటక తోడ్పడలేదని రాజీవ్ చంద్రశేఖర్ తిట్టిపోస్తారు. సంక్షేమ పథకాలను వక్రంగా చిత్రించడమే గాక సహాయ నిరాకరణ చేస్తారు. కర్ణాటక ప్రభుత్వం 'అన్న భాగ్య' పేరిట పథకం చేపట్టి ఎఫ్‌సిఐతో ఒప్పందం కుదుర్చుకుంటే కేంద్రం ఒత్తిడి తెచ్చి రద్దు చేయిసుస్తుంది. పంజాబ్‌లో 'ఆప్' పథకాల పైనా కేంద్ర మంత్రులు దాడి చేస్తారు. రాష్ట్రాలకేగాక కేంద్రం అదుపు కూడా లేకుండా 'పి.ఎం కేర్స్' పేరిట భారీ నిధి వసూలు చేస్తారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం చేసిన వారికి పన్ను, పి.ఎం కేర్స్ అయితే కార్పొరేట్ సామాజిక బాధ్యత అంటూ వివక్షత చూపిస్తారు.

చెదురుమదురుగా కనిపించే ఈ అంశాలన్నీ ఒక్కచోటికి చేర్చి చూస్తే మోడీ సర్కార్ కుటిల వ్యూహం ఏమిటో బోధపడుతుంది. కులం, మతం, జాతి దురభిమానం వంటివి రగిలించడం ఒకవైపు దేశ విశాలత్వాన్ని భిన్నత్వాన్ని చూపే రాష్ట్రాల వనరుల హక్కుల పైన దాడి మరోవైపు చేయడం ద్వారా వాటిని బలహీనపర్చాలి. తద్వారా రాష్ట్రాలలో తమను బలంగా సవాలు చేస్తున్న ప్రతిపక్షాలను దెబ్బ తీయాలి. ప్రధాని మోడీనే సర్వశక్తిమంతుడుగా, సకల నిర్ణయ సంధాతగా చూపించాలి. మిగిలిన నేతలనూ పార్టీలనూ ఆఖరుకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూడా డమ్మీలను చేయాలి. అయితే చైతన్యవంతులైన భారతీయులు, రాజ్యాంగం, న్యాయస్థానాలు... అన్నిటినీ మించి ప్రజా న్యాయస్థానం అందుకు అవకాశమివ్వడం కల్ల.

## ఆవిష్కృతమౌతోన్న సత్యం

ఒకరి జీవితాన్ని మరొకరు కొల్లగొడితే
ఒకరు ఇంకొకరిపై చెయ్యెత్తితే అది దాడి
దాడికి ప్రతిగా ఒక జాతి జాతినే
ధ్వంసించాలనుకుంటే అది యుద్ధం !
యుద్ధానికి యుద్ధమే
పరిష్కారమంటే అది కపట నీతి
వేల ఏండ్ల కిందట రూపు దిద్దుకున్న
రెండు జాతులు
పరస్పర హననానికి పాల్పడుతుంటే అది
అజ్ఞానం

సామ్రాజ్యవాద శక్తులంతా
ప్రపంచ పోలీసులంతా ఒక్కటై
యుద్ధాన్ని యెగదోస్తూ కొమ్ము కాస్తుంటే
అది ఆయుధ వ్యాపారం
పాలస్తీనాది ఉగ్రవాదమని ఇజ్రాయెల్‌ది
వీర శౌర్యమని
ప్రసార మాధ్యమాలు ఊదరగొడుతుంటే
అది దుష్ప్రచారం
భూమ్యాకాశ జల మార్గాల దిగ్బంధనంతో

యుద్ధ తుపాను సృష్టిస్తోన్న ఇజ్రాయెల్
చిగురుటాకులా వణుకుతూ
గిలగిల తన్నాడుతోన్న స్ట్రిప్ లాంటి గాజా
తెగిపడిన కంకాళాల మధ్య
విడిపడిన శరీర భాగాల మధ్య
రక్తమోడుతున్న మానవ బంధాల మధ్య
వధ్యశిలలుగా మారిన భవన శిధిలాల
మధ్య
కావాలిప్పుడు వసివాడిన
పసిపిల్లల భవిష్యత్తుకు జవాబు !
నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించమన్న

మనుష్యులంతా ఒకటే సంతానమన్న
ఎక్కడ ఆ దైవ కుమారుల అడుగు జాడలు
దైవమూ లేదు
దైవ కుమారులూ లేరన్న
పచ్చినిజం బయటపడుతోంది
ప్రవక్తలూ లేరు వారి
ప్రవచనాలుకు విలువా లేదన్న
వాస్తవం వెలుగులోకొస్తోంది
మనిషిని మనిషే రక్షించుకోవాలనే
మానవత్వ సాక్షాత్కారం అవసరమన్న
సత్యం ఆవిష్కృతమౌతోంది !

**– పి. మురళీ కుమార్**

### రిపోర్టర్లలను బలోపేతం కోసం

## శ్రీ వీరేశలింగం పంతులు ప్రగతి బాట పథకం: ఆల్ తెలుగు ప్రజాపార్టీ




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):బహుజన రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో వస్తున్న నూతన రాజకీయ పార్టీ "ఆల్ తెలుగు ప్రజాపార్టీ" తన మేనిఫెస్టోలో విలేకరుల శ్రేయస్సు కోసం, రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఉన్న రిపోర్టర్ల బలోపేతం కావటానికి లిశ్రీ వీరేశలింగం పంతులు ప్రగతి బాట పథకాన్ని తమ మేనిఫెస్టో లో చేర్చినట్లు పార్స్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం రిపోర్టర్లలను బలోపేతం చేయడానికి మరియు లక్షాధికారులుగా చేయడానికి ఇచ్చే హామీ అని,ఈ పథకాన్ని మాస్టర్ కీ ఛానల్ సీఈఓ రాంబాబు నాయుడు ,అవుట్ పుట్ ఎడిటర్ వాసుదేవన్,ఇన్పుట్ ఎడిటర్ దుర్గాప్రసాద్,మాస్టర్ కి టీవీ ఛానల్ రూపొందించినట్లు ఆయన తెలిపారు.

ఈ పథకం ముఖ్య అంశాలు, లక్ష్యాలు...

1.రిపోర్టర్లుగా పనిచేసే ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డ్స్ ఇవ్వబడును. జర్నలిస్టుల హక్కులు., స్వేచ్ఛ కోసం మీడియా కమిషన్ తీసుకు వస్తాం. ఇందులో న్యాయమూర్తులు., పోలీస్ అధికారులు., మీడియా ప్రముఖులు ఉంటారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునే అధికారం కలిగి ఉంటుంది.

2.ఇళ్ల స్థలాలతోటి ఇల్లు ఇవ్వబడును.

రిటైర్డు జర్నలిస్టులకు నెలకు రు. 15,000 పెన్షన్ ఇవ్వనున్నాం. రిటైర్డు జర్నలిస్టులను ప్రతి ప్రభుత్వ సంస్థలోనూ., విభాగంలోనూ., చివరకు పంచాయితీ లో సైతం సలహాదారులుగా నియమించుకుంటాం.

3 స్మాల్ అండ్ మీడియం అని తేడా లేకుండా అన్ని పేపర్లకు , కేబుల్ ,శాటిలైట్ ,సోషల్ మీడియా నడిపించే వారికి కూడా ప్రభుత్వ ప్రకటనలుఇవ్వబడును

4.కోఆపరేటివ్ బ్యాంక్ ద్వారా రూ. 1000/–నుంచి 10 లక్షల రూపాయలు వరకు పావల వడ్డీతో రుణ సదుపాయం.

5. ఉచిత నిర్బంధ విద్య కేజీ టు పీజీ .

6.ఉచిత వైద్య సదుపాయాలు మరియు మందులు కూడా సప్లై చేయబడును.

8. ఉద్యోగ కల్పన అన్ ఎంప్లాయ్మెంట్ హఠావో పథకంలో బాగంగా ప్రతి విద్యార్థికి ఉద్యోగం వచ్చే వరకు అన్ని రంగాల్లో ఉచితంగా ట్రైనింగు ఇస్తూ వసతి , ఆహారం కూడా కల్పించబడును

9.అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్.

10. పోలీస్ వ్యవస్థ నుంచి రక్షణ గురించి ఉచిత న్యాయసహాయం అందించబడునని ఆయన తెలిపారు.

## బుద్ధుని బోధనలు శాంతి విస్తరణకు తోడ్పడుతాయి



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 29 (ప్రజాపాలన, ప్రతినిధి) : బుద్ధుని బోధనలు శాంతి విస్తరణకు తోడ్పడతాయని బుద్దిస్ట్ ఇంటర్నేషనల్ నెట్ వర్క్ ఆంధ్ర, తెలంగాణ, రాష్ట్రాల అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో ఆదివారం నిర్వహించిన 68వ దమ్మ చక్ర పరివర్తన దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ బుద్దుని బోధనలు సకల మానవాళి జీవితాల్లో శాంతిని అందిస్తుందని, ప్రపంచం అంతా బుద్ధుని బోధనలు అవలంబించాలన్నారు. అంబేద్కర్ కృషి వల్లనే ఎస్సి, ఎస్టీ, బిసి,లకు అవకాశాలు దక్కి గొప్ప స్థాయిల్లో ఉన్నారని, అంబేద్కర్ త్యాగాలతో ఉద్యోగాలు పొందిన ప్రతీ ఒక్కరు సమాజం కోసం ఆలోచించాలని, రాబోయే తరాలకు మార్గ నిర్దేశనం చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరూ వారి వారి ధర్మాన్ని, ఉనికిని కాపాడుకోడానికి, ఖచ్చితంగా కృషి చేయాలని సూచించారు. గౌతమ బుద్దుని బోధనలు సమాజ హితం కోసం మాత్రమే ఉంటుందని, శాస్త్రీయ దృక్పథం తో ఉంటాయని ప్రతీ ఒక్కరు పాటించాలని కోరారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బౌద్ధ కవి మధు భావర్కర్, అంబేద్కర్ సెంటర్ కమిటీ అధ్యక్షులు జాడి బాపు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహెూల్కార్, లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి దీపక్, సెంటర్ కమిటీ కార్యదర్శి సుధాకర్, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణాజి జాడి, లుంబిని దీక్ష భూమి కార్యదర్శి అశోక్ జాడే, ఉపాధ్యక్షులు లీలారాణి, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, లుంబిని దీక్ష భూమి మాజీ అధ్యక్షుడు తిరుపతి, అంబేద్కర్ సంఘం నాయకులు పెరుగు ఆత్మారాం , శ్యామ్ రావ్, పుల్లయ్య కాంబ్లే, తుకారాం, బాబురావు, వినేశ్, తుకారం, సంతోష్ ఝూడే, చైతన్య, హేమంత్ షిండే, అనిల్, రాజేశ్వర్, మారుతి, పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి మీ బిడ్డగా మీ మధ్య ఉంటూ సేవ చేస్తా :లింగాల కమల్ రాజు



మధిర రూరల్ అక్టోబర్29 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో టిఆర్ఎస్ అభ్యర్థి మద్దతుగా 21 వ వార్డు 17వ వార్డులు తిరుగుతూ రానున్న ఎన్నికల30 రోజుల్లో టిఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ఇంటింటి తిరుగుతూ ప్రజలను ఓటు వేయాలని అఖండ మెజార్టీతో గెలిపించాలని బి ఆర్ఎస్ నాయకులు కోరారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మధిర అసెంబ్లీపై ప్రజలందరి సహకారంతో గులాబీ జెండా ఎగరేస్తాంకెసిఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే కారును హై స్పీడ్ లో నడిపిస్తాయిరాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేమధిర ప్రజల ఓట్లతో ఎమ్మెల్యే గా గెలిచిన భట్టి విక్రమార్క ఇక్కడ ప్రజలను గాలికి వదిలేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం హక్కున చేర్చుకొని అండగా నిలిచింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మధిర అభివృద్ధి చేయలేని భట్టి విక్రమార్క ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని తానే చేస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంఓటమి భయం తట్టుకోలేక సంక్షేమ పథకాలపై భట్టి విక్రమార్క తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడు నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశాం.. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసుకుంటాంమున్సిపాలిటీలో 100 పడకల ఆసుపత్రి, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు సహా కోట్ల రూపాయల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందిరైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆసరా పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం వంటి విప్లవాత్మక పథకాలు అమలు చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వంజడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్ రాజు , సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్ రాజు , రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నాడు పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ ఎన్నికలు 30 రోజుల్లో వస్తున్నాయని ప్రతి ఒక్కరు మధిర అసెంబ్లీ పైన ప్రజలందరి సహకారంతో గులాబీ జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎన్నికల్లో కారును హై స్పీడ్ లో నడిపిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని అసెంబ్లీ నుండి కూడా అధికార పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన భట్టి విక్రమార్క ఇక్కడ ప్రజలను గాలికి వదిలేస్తే బీఆర్ఎన్ ప్రభుత్వం హక్కున చేర్చుకొని అండగా నిలిచిందన్నారు.. మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని రానున్న రోజుల్లో మధిర నియోజకవర్గాన్ని ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ గా, ప్రభుత్వ చీఫ్ విప్ గా పని చేసిన భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచలేదు కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తానే చేస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. భట్టి విక్రమార్క తన ఓటమి భయం తట్టుకోలేక దళిత బంధు, గృహ లక్ష్మీ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. నియోజకవర్గ కేంద్రం మధిర పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం లాంటి కోట్లాది రూపాయల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం వంటి విప్లవాత్మక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నుండి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు

## చిలుకానగర్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ సీనియర్ నేతలు కాంగ్రెస్ లో చేరిక



మేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) చిలుకానగర్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ సీనియర్ నేతలు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు పరమేశ్వర్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో జేరిపోతుల చంద్రయ్య. గంగారం యాదగిరి. టి కృష్ణ. నాకు సత్యనారాయణ. కే ఆంజనేయులు. రాములు. అరకుల సత్యం ,జి కృష్ణ, కానుగంటి యాదగిరి ,మల్లేశం ,సత్తిరెడ్డి ,ఆర్ రవి ,డేవిడ్ దుర్గేష్ చంద్రయ్య యాదగిరి పరశురాములు ఎల్ల స్వామి నవీన్ కుమార్. జేరిపోతుల అనురాధ. కే అనసూయ. జి సుజాత. పి మాధవి. జయప్రద. సిహెచ్ స్వరూప. పి రేణుక కవిత. బి మంజుల తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ అధ్యక్షులు కొంపల్లి బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, ఆకిటి ఆగంరెడ్డి, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, జగదీష్ ముదిరాజు, పల్నాటి రమేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పరమేశ్వర్ రెడ్డికి ఉప్పల్ గంగపుత్ర సంఘం సంపూర్ణ మద్దతు



మేడిపల్లి, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తవిడబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెటస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డికి ఉప్పల్ గంగపుత్ర సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం ముఖ్య నాయకులు సభ్యులు లెల్లల వెంకటేశ్, పర్రే వెంకట్ పాపయ్య, ఇటికల శివనారాయణ, గోపాల కృష్ణ, గొంగిడి వెంకటేశ్, గోధుమల అంజనైలు, పబ్బు సాయి కిరణ్, పర్రీ శ్రీనివాసులు, మగిలిపల్లి వెంకటయ్య, శ్రీను, మాదరబోయిన రాములు, అంజనెలు ,రచ్చ దానయ్య, మధు, నాసు యాదగిరి, ఆర్టీసీ యాదగిరి, లెల్లల దానయ్య, దీటి సత్తయ్య , కాయ యాదయ్య,హరిక్రిష్ణ, ఐబి చంద్రయ్య, టి రాజ్ కుమార్, అంబటి రఘు,చుక్కల శ్రీనివాస్, కాయ ఉపేందర్ మొదలైన సంఘసభ్యులు పాల్గొని ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పరమేశ్వర్ రెడ్డికి మద్దతు తెలిపినారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల బడ్జెట్ కేటాయించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్




ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : మధ్యాహ్న భోజన కార్మికుల బడ్జెట్ కేటాయించాలని, ప్రతి విద్యార్థి టిఫిన్ కు రూ 25 పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించడానికి సరైన బడ్జెట్ కేటాయించకుండా కార్మికులతో వెట్టి చేయించుకునే విధంగా ఈనెల 1వ తేదీ నుండి పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించాలని ఇడ్లీ, పూరి, బొంబాయి రవ్వతో ఉక్మ, కిచిడి, దానికి సంబంధించిన చట్నీలు తయారు చేసి విద్యార్థులకు వడించాలని జీవోను జారీ చేసిన అన్నారు. కానీ దానికి సంబంధించిన డబ్బులు ఇవ్వకపోవడంతో కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. యూనియన్ జిల్లా ఇంచార్జ్ కృష్ణమాచారి మాట్లాడుతూ ఒక విద్యార్థికి రూ 10,50 పైసలు చెల్లించి పూరీలు ఇడ్లీలు పెట్టాలని, ఉదయం 8 గం లోపు చేయాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి హెూటల్లో టిఫిన్ చేస్తే రూ 40 అవుతుందని, స్కూల్లో 100 మంది విద్యార్థులు ఉంటే 8:30 కె టిఫిన్ ఎలా తయారవుతుందన్నారు. కేవలం రూ 2000 జీతం ఇస్తానన్నడం ఎంతవరకు సమంజసం అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పని భారం పెరుగుతుందని, డబ్బులు అదనంగా ఖర్చవుతుంది కాబట్టి ఈ పథకం సజావుగా సాగాలంటే ప్రతి విద్యార్థికి రూ 25 అల్పాహారానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట సామాగ్రి గ్యాస్ తదితర సామాగ్రి కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

Serves Members Serves People Connects Members
SNEHA CLUB
Pay Back to Society... Not to criticise any one...
All the donation to SNEHACLUB are exempted fromincome tax under section 80G of income tax act, 1961
Join & Support
Let this MISSION reach to the ROOTS of the SOCIETY for extending MUTUAL HELP
WE DARE ... to achieve what we wish
WE CARE ... to support us
Contact: 7416358036

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ.5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

SNEHA MACS LTD Ph : 7660027682
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళికోసం కానుకగా
5 సం.ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 12% వడ్డీ
గత 20 సం॥లుగా సమాజ మార్పు కోసం కంపెనీకి వచ్చే లాభాలను పేద ప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ SOCIAL ENGINEERING చేస్తున్నాం
H.NO. NO. 6-2-19/3/12, 3rd Floor, Doulat Plaza, Lakdikapool, Hyderabad, Telangana.
Email : snehamacsltd@gmail.com

స్నేహ పెండ్లిపిలుపు
స్నేహ మ్యారేజ్ బ్యూరో
వివరాలకు :
https://snehapellipilupu.com/
9154958315

SNEHA MACS LTD Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
Regd. No. TS/ DCO/HYD/MACS/2017?314 Dt 30th May 2017
స్నేహ పెన్షన్ స్కీమ్
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును
సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55,000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/-
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువకు, పెళ్ళికోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
డాక్టర్ కె. శివభాగ్యారావు IRS, VRS చైర్మన్
ఎస్. రామకృష్ణ మ్యాక్స్ ప్రెసిడెంట్, సెల్:9133312134

bahujan bazaar
మీరు కోరుకున్న పుస్తకాలు / ప్రొడక్ట్స్ మీ ఇంటికి వద్దకే చేర్చే ఆన్లైన్ షాపింగ్
To Order Visit : www.bahujanbazaar.in
Contact No. : 8886022523

## అయ్యప్పలకు బిక్ష అందించిన కొవ్వలి



నరసాపురం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు ఏర్పాటుచేసిన భిక్ష కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీక్ష చేపట్టిన స్వాములకు భిక్ష సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడుకు స్వామివారి శేష వస్త్రంతో చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల నీలిమ, సంకు భాస్కర నాయుడు, కోటిపల్లి బ్రహ్మానందం, కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## జనసేన- తెదేపా సమావేశంలో పాల్గొన్న నాయకర్



నరసాపురం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా జనసేన –తెలుగుదేశం పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర పిఎసి సభ్యుడు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ చైర్మెన్, రాష్ట్ర జనసేన – టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు, నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ జనసేన– తెలుగుదేశం పార్టీలు పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుల ఆదేశాల మేరకు ఇరు పార్టీలతో కూడిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని వైసీపీ ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటూ రానున్న ఎన్నికలలో విజయం సాధించి అధికారంలోకి వచ్చేందుకు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేందుకు ఇరు పార్టీల నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## మరియ తల్లి జీవితం మానవాళికి ఆదర్శం



పోరుమామిళ్ల ప్రజాపాలన ప్రతినిధి : మరియతల్లి జీవితం ప్రపంచమానవాళికి ఆదర్శం అని పోరుమామిళ్ల డీన్ రెవ. ఫాదర్ జాలా విజయభాస్కర్ అన్నారు. టేకురుపేటలోని పునీత జోజప్ప గారి దేవాలయంలో జపమాల మాత మాస ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఏర్పాటు చేసినటువంటి దివ్య బలి పూజ లో పాల్గొని సందేశం అందించారు. ప్రేమ, దయ, స్వచ్ఛత, సేవ కలుషితం లేని మనసుకు ప్రతి రూపమే జపమాల మాత ఉన్నారు. ప్రతిరోజు జపమాల ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందము కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టేకురు పేట విచారణ గురువులు రెవ. ఫాదర్ అనిల్ వీరి ఆనందరావు టీచర్ బద్వేల్ విచారణ గురువులు విజయరావు దేవరాజు, గురువులు, కన్య స్త్రీ లు, విచారణ పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాలలో అలజడి సృష్టించాలని ఉద్దేశంతో టిడిపి వారు కృష్ణారెడ్డిని హత్య చేశారు

**నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. అక్టోబర్ 29 (ప్రజా పాలన ప్రతినిధి.) గురజాల నియోజకవర్గం లోని గ్రామాలలో అలజడి సృష్టించాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎర్రచని శ్రీనివాసరావు తమ అనుచరులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడైన కృష్ణారెడ్డి దారుణంగా హత్య చేశారని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురజాల పట్టణంలోని జంగమహేశ్వరపురం గ్రామం నందు ఇటీవల హత్యకు గురైన కునిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్సీ జంగ కృష్ణమూర్తి , ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి మాట్లాడుతూ కృష్ణారెడ్డి ని హత్య చేసిన అంతుకులను ఏ స్థాయి వారైనా వెంటనే అరెస్ట్ అరెస్టు చేయాలని అన్నారు. గ్రామాలలో ప్రశాంతత లేకుండా చేయాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీసీ సమాజం మోడీకి రుణపడి ఉంటుంది



చేవెళ్ల అక్టోబర్ 29 (ప్రజాపాలన): యావత్తు బిసి సమాజం ప్రధాని నరేంద్ర మోడీకి రుణపడి ఉంటుందని ,ఓబిసి మండల అధ్యక్షులు బొబ్బిలి కుమార్ గౌడ్,ప్రధాన కార్యదర్శి గౌడిచర్ల రమేష్ అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో ఓబిసి మండల అధ్యక్షులు బొబ్బిలి కుమార్ గౌడ్ గౌడి చర్ల రమేష్ ఆధ్వర్యంలో మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించినందుకు మోదీకి ధన్యవాదాలు తెలిపారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న బీసీలను గుర్తించి నందుకు మోదీకి కృతజ్ఞతగా మోదీకి పాలాభిషేకం చేశారు. బీసీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించినందుకు బీసీ సామాజిక వర్గం నరేంద్ర మోడీకి రుణపడి ఉంటారన్నారు. మోదీ రామ రాజ్యంలో ప్రజల సుభిక్షంగా ఉన్నారన్నారు. ఆయన దేశ భద్రత విషయంలో తీసుకున్న 371 ఆర్టికల్, నోట్ల రద్దు, జీఎస్టీ, నిర్ణయాలు చరిత్రత్మకమైన ఘట్టాలు అన్నారు. దేశభద్రత విషయంలో ఏమాత్రం తలొగ్గకుండా పటిష్టమైన నిర్ణయాలు తీసుకోవడం భరతభూమికి గర్వకారణమన్నారు. దేశ రక్షణ విషయంలో దేశ భూభాగాన్ని అంగుళం కూడా వదలని బిజెపి పరిపాలన చూసి ప్రపంచ దేశాల్లో జెంకుతున్నాయన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీకిప్రజలు రుణపడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పాండు రంగారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి అత్తిలి అనంతరెడ్డి, వెంకటేష్ బి వెంకటేష్ శంకర్ చారి, టి గోపాల్ పత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి టికెట్ రఘునాథ్ వెరబెల్లి కే కేటాయించాలి

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు**



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 29, ప్రజాపాలన : భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి కి మంచిర్యాల అసెంబ్లీ టికెట్ కేటాయించాలని వారి సేవలను పార్టీ గుర్తించాలని గుర్తిస్తుందని నమ్మకంతో విశ్వాసంతో ఉన్నామని బిజెపి మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడంలో రఘునాథ్ వెరబెల్లి క్రియాశీలకమైన పాత్ర పోషించాలని వారు పార్టీ అభివృద్ధి కొరకు విస్తృతంగా పర్యటనలు చేసి కష్టపడ్డారని వారి యొక్క సేవలను పార్టీ గుర్తించాలని అన్నారు. కరోనా కష్టకాలంలో మెడికల్ కిట్లు నిత్యవసర సరుకులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం వారికి బ్యాగులు నోట్ బుక్స్ నిరుద్యోగులకు రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ద్వారా సేవా భారతి ద్వారా ఉచిత కోచింగ్ స్టడీ మెటీరియల్ అందిస్తూ గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి మహిళలకు బతుకమ్మ నాణ్యమైన చీరలు అందిస్తూ రైతుల పక్షాన పాదయాత్ర ధర్నా రాస్తారోకోలు చేస్తూ పార్టీ తరపున ఉప ఎన్నికలలో నిలబడిన రఘునందన్ రావు ఈటల రాజేందర్ గెలుపులో కీలక పాత్ర పోషించి జిహెచ్ఎంసి వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాగార్జునసాగర్ మునుగోడు ఉప ఎన్నికల్లో ముఖ్య భూమిక పోషించిన ప్రజా నాయకుడైన ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా ఉద్యమిస్తున్న రఘునాథ్ సేవలను పార్టీ వినియోగించుకోవాలని వారు నిలబడితే పార్టీ మంచిర్యాల అసెంబ్లీలో తప్పకుండా గెలుస్తుందని పార్టీ అధినాయకత్వం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్ బిజెపి పార్లమెంట్ బోర్డ్ సభ్యులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్,ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ప్రత్యేక చొరవ తీసుకొని వారికి మంచిర్యాల బిజెపి టికెట్ కేటాయించాలని కోరారు.

## జిల్లాలో వాసవి క్లబ్బుల సేవలు అమోఘం

**అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు ఐత రాములు**




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 29, ప్రజాపాలన : జిల్లాలో వాసవి క్లబ్బుల సేవలు అమోఘం అని అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు ఐత రాములు అన్నారు. ఆదివారం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 107 వార్షిక సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు జిల్లాలోని 35 వాసవి క్లబ్బులు అంతర్జాతీయ స్థాయిలో చాలా గొప్పగా సేవలు అందిస్తున్నాయని జిల్లాలోని పేద వర్గాల ప్రజలకు అమావాస్య అన్నదానం పౌర్ణమి అన్నదానాలు బీద వారికి నోటు పుస్తకాలు స్వామి వారి వ్రతాలు చెట్లు నాటడం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల వారికి వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి అంతర్జాతీయ స్థాయిలో పలువురి మన్నలను పొందడం జరిగిందని ఈ సంస్థలో ఆర్యవైశ్యులు సభ్యులుగా ఉండి అన్ని వర్గాల ప్రజలకు సేవను అందిస్తున్నందుకు భారత రాష్ట్రపతి అవార్డులు కూడా 2013 లో పొందడం జరిగిందని గుర్తు చేశారు. 2024 సంవత్సరానికి కొత్త గవర్నర్ ను ఎంపిక చేయడం జరిగిందని ఎన్నికల అధికారిగా బాల సంతోష్ చైర్మన్ ముక్తా శ్రీనివాస్ కో చైర్మన్లుగా కట్కం హరీష్ శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ దంపతులు కొండ చంద్రశేఖర్ పద్మ సిరిపురం సత్యనారాయణ పవిత్రం శ్రీనివాస్ ఎక్కిరాల శ్రీనివాస్ కలికోట శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు.

## పట్నంలో బిజెపి జెండా ఎగరడం ఖాయం

**దయానంద్ గౌడ్ ను అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తాం**






ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 29 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వైష్ణవిగార్డెన్లో బిజెపి బూత్ మీటింగ్ ఏర్పాటు చేయడమైనదిఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ గౌడ్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా కన్వీనర్ యాదగిరి రెడ్డి వారి ఆధ్వర్యంలో ఈ సమావేశంలో మాట్లాడుతూ గతంలో కూడా ఇబ్రహీంపట్నం ఈసారి బీసీ అభ్యర్థిని బరిలోకి దిగిన దయానంద్ గౌడును గెలిపించాలని ప్రతి ఒక్కరూ పార్టీ కొరకు కంకణబద్ధులై పని చేయాలని ఆయన ఈ సమావేశంలో సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో సీఎం కావాలని బిజెపి తరపున ప్రతి పార్టీకి బిజెపి గట్టి పోటి నీస్తు పార్టీని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిపల్లి జయ్య యాదవ్, వనపర్తి జిల్లా ఇన్చార్జి బోసు పెల్లి ప్రతాప్, అరుణ్ కుమార్ , జాతీయ కిసాన్ మోర్చా భోజిరెడ్డి, పో రెడ్డి నరసింహారెడ్డి, కొత్త అశోక్ గౌడ్, అసెంబ్లీ ఇన్చార్జ్ ముత్యాల భాస్కర్, నాహిని సత్యనారాయణ, పో రెడ్డి అర్జున్ రెడ్డి, జక్క నరసింహారెడ్డి, జక్క రవీందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, ధన్నే భాషయ్య, సిగ వీరస్వామి, తాండ్ర రవీందర్, నరసింహ గౌడ్ శ్రీశైలం,జంగయ్య, బచ్చి గళ్ళ రమేష్, నక్క శ్రీనివాస్, కార్తీక్ గౌడ్, మధుసూదన్ రెడ్డి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిపి కార్మికుల వేతనాలు చెల్లించాలని" 6న చలో కలెక్టరేట్"

**సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్**




ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, నవంబర్ 6న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 6 నెలలుగా పెండింగ్లో ఉండడంతో పండుగలు వస్తే పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా అధికారులకు ఇన్నిసార్లు విన్నవించినా కార్మికుల పెండింగ్ లో ఉన్న వేతనాలు, చెల్లించాలని కోరిన, పట్టించుకోవడం లేదన్నారు. కావున నవంబర్ 6వ తేదీన చలో కలెక్టరేట్ కు జిల్లాలో గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్, మాట్ల రాజు, సమ్మయ్య,లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు



చేవెళ్ల అక్టోబర్ 29 (ప్రజాపాలన): బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బిజెపి నేత మాజీ ఎమ్మెల్యే రత్నం అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే రత్నం పాల్గొని మాట్లాతూ, చేవెళ్ల ప్రాంతం పదేళ్లుగా దోపిడికి గురైందని, ఎమ్మెల్యే కాలే యాదయ్య నామినేటెడ్ పదవులను అమ్ముకున్నారని విమర్శించారు పేదల భూములు ఆక్రమించి కోట్ల రూపాయలు వెనకేసుకున్నారని మండిపడ్డారు. యాదయ్య అవినీతి అక్రమాలు, అరాచకాలను కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ చేస్తున్నామని కొన్ని నెలల క్రితం ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య ప్రకటించారని.. ఆ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. పదేళ్ల క్రితం బస్ డిపో కోసం స్థలం సేకరిస్తే ఎందుకు ఇప్పటివరకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే ఓటు ద్వారా బుద్ధి చెబుతారని, ప్రధాని మోడీ హాయంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి అనంతరెడ్డి, వెంకటేష్, శంకర్ చారి గోపాల్ పత్తి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో నిర్వహించే నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాల వలన తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి నిర్వహించు ప్రజావాణి కార్యక్రమ వివరాలను మళ్లీ ప్రకటించడం జరుగుతుందని, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## బిఆర్ఎస్వి రాష్ట్ర స్థాయి సమావేశానికి జిల్లా నాయకులు




ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఆదివారం బీఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరై శ్రేణులకు రానున్న ఎన్నికలకు సంబంధించి దిశ నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని, ప్రతి ఒక్కరికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇర్ఫాన్, వసీం, భరద్వాజ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## అజీర్తి, గ్యాస్ సమస్యలను ఇలా చెక్‌పెడదాం..




ఈ మధ్య కాలంలో చాలా మంది అజీర్తి, గ్యాస్ సమస్యలతో బాధపడుతున్నారు. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్‌ఫుడ్స్ లాంటి ఆహారపు అలవాట్లు వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి ఆహార పదార్థాలు తరచూ తీసుకోవడం వల్ల జీర్ణాశయానికి సంబంధించిన గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం తదితర సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యల నుంచి త్వరగా బయటపడటానికి ఇంగ్లిష్ మందులు వాడుతున్నారు. ఈ మందులకు బదులుగా మనం ఇంట్లో సులువుగా కొన్ని చిట్కాలను ఉపయోగించి అజీర్తి ఇంకా గ్యాస్ ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

వాముతో చక్కని పరిష్కారం

ఆయుర్వేదంలో ఇలాంటి సమస్యలకు వాము చక్కని పరిష్కారంగా చెబుతున్నారు. అయితే ఈ వాముని ఏ విధంగా వాడితే జీర్ణాశయ ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. వాము వలన జీర్ణాశయానికి చాలా లాభాలు ఉన్నాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్ మొదలైన సమస్యలను దూరం చేస్తుంది. జీర్ణక్రియలో ఇబ్బందులను తొలగించి జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. వామును నిమ్మరంతో కలపి తీసుకుంటే హైడ్రోక్లోరిన్ యాసిడ్ పునరుద్ధరించబడి ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.

## సీజనల్ వ్యాధులను ఈ మందులతో అడ్డుకట్ట వేయొచ్చు!



వానాకాలంలో విజృంభించే బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల జలుబు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్, బ్రాంఖైటిస్ మొదలైన వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే చికున్ గున్యా, డెంగ్యూలతో అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి, సత్వర వైద్యం తీసుకోవడం వల్ల పరిస్థితి విషమించకుండా ఉంటుంది. తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, నీరసం, ఆకలి మందగించడం, వికారం, వాంతులు, శరీరం మీద దద్దుర్లు, చర్మం ఎర్రబడడం, అంతర్గత, బాహ్య రక్తస్రావం డెంగ్యూ ప్రధాన లక్షణాలు. పరిస్థితి తీవ్రమైతే రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. అవసరాన్ని బట్టి ఐవి ద్వారా ద్రవాలను అందిస్తూ, రక్తపోటును పరీక్షిస్తూ ఉండాలి. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్ల మార్పిడి కూడా అవసరం పడవచ్చు.

హోమియో పాత్ర ఇదే!

డెంగ్యూ అనేది ఆస్రత్రిలో రోగిని నిశితంగా పరిశీలించవలసిన వ్యాధి. సంప్రదాయ ఔషధాలతో పాటు హోమియో మందులను కూడా ఇవ్వడం ద్వారా రోగి కోలుకునే సమయం వేగాన్ని పెంచవచ్చు. హోమియో మందుల్లో భాగంగా యూపటోరియం పర్ఫ్‌ను 30 పొటెన్సీతో తీసుకోగలిగితే, ప్రోత్సాహక ఫలితాలు దక్కడంతో పాటు రోగి బాధలు తగ్గి, కోలుకునే వేగం పెరుగుతుంది. రోగి లక్షణాల ఆధారంగా ఇదే ఔషధాన్ని వేర్వేరు పొటెన్సీలలో వైద్యుల సూచనలను బట్టి వాడుకోవచ్చు. అలాగే ఎకొనైట్, బెల్లడొనా, బ్రయోనియా, జెల్సిమియం, ఇపెకాక్, క్రోతాలస్, ఫాస్ఫరస్, రస్టాక్స్ వంటివి సమర్థవంతంగా పని చేస్తాయి.

ముందస్తు జాగ్రత్తలు

పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోని నీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలి. కాచి వడబోసిన మంచి నీళ్ల తాగాలి. తాజా ఆహారం, సీజనల్ ఫ్రూట్స్ తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. సంపులు, నీటి ట్యాంకుల్లోకి దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు, శరీరానికి లేపనాలు వాడాలి. డెంగికి కారణమైన ఈజిప్టీ దోమలు పగటివేళ కుడతాయి. కాబట్టి బడుల్లో తగిన జాగ్రత్తలు పాటించేలా యాజమాన్యాలకు సూచించాలి.

## ఆ వ్యాధులను కూడా ఆట కట్టించొచ్చు!



ఆస్తమా, హెచ్‌ఐవి లాంటి మొండి వ్యాధులకు హోమియోలో సమర్థమైన మందులున్నాయి. వ్యాధుల ఆట కట్టించి, ఆరోగ్యాన్ని అందించే సామర్థ్యం హోమియో వైద్యానికి ఉంది.

సైనసైటిస్, ఆస్తమాలు మళ్లీ బాధించవు

సైనసైటిస్, ఆస్తమా దీర్ఘకాలం వేధించే జబ్బులని చాలా మంది అనుకుంటారు. కానీ వీటిని హోమియో తో శాశ్వతంగా తగ్గించే వీలుంది. సైనస్‌లో ఉండే డిఫెన్స్ మెకానిజం చాలా వరకూ శరీరంలోకి చొరబడకుండా సూక్ష్మజీవులను అడ్డుకుంటుంది. కానీ ఐదు మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే పార్టికల్స్ సైనస్‌లో ఆగకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుకుంటాయి. తుమ్ముల ద్వారా శరీరం వీటిని బయటకు పంపించే ప్రయత్నం చేస్తుంది. పురుగుమందులు ఉపయోగించి పండించిన పదార్థాలు తినడం, వాతావరణ కాలుష్యం, ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దుమ్ము, ధూళితో కూడిన ప్రదేశాల్లో ఎక్కువ సమయాలు గడపడం, వంటివి సైనస్‌కూ, ఆస్తమాకు దారి తీస్తాయి.

హెచ్‌ఐవి, హెర్పిస్ ఆటకట్టు

హెచ్‌ఐవి సోకితే మరణం తప్పదనే భావన ఇప్పటికీ చాలా మందిలో ఉంది. నిజానికి హోమియోలో హెచ్‌ఐవి వైరస్‌ను కట్టడి చేసే మందులున్నాయి. హెచ్‌ఐవి విస్తరించడానికి కారణం, దీని లక్షణాలు కొన్నేళ్ల తర్వాత ఆలస్యంగా బయటపడడమే! అప్పటివరకూ వారికి హెచ్‌ఐవి ఉన్న విషయం కూడా తెలియదు. రోగనిరోధకశక్తి తగ్గినప్పుడు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. విరేచనాలు కావడం, బరువు తగ్గడం, ఇతరత్రా వ్యాధులు విజృంభించడం, వాతావరణ మార్పులను తట్టుకోలేకపోవడం, తేలికగా వ్యాధుల బారిన పడడం జరుగుతూ ఉంటుంది. హెర్పిస్‌లో.. పురుషాంగం మీద చమట పొక్కులు మాదిరిగా దురదతో కూడిన ఎర్రని నీటి పొక్కులు కనిపిస్తాయి. ఇవి పగిలి పుండ్లుగా మారతాయి. తగిన చికిత్స తీసుకోకుండా లైంగిక కలయిక ద్వారా ఈ పొక్కులు ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుంది.

నడుం నొప్పి, మెడ నొప్పిని ఎన్నాళ్లు భరిస్తారు?

మెడ, వెన్నుపాములో మార్పులు రావడం వల్ల నాడుల మీద ఒత్తిడి పెరిగి ఈ సమస్య తలెత్తుతుంది. మెడ బిగుసుకుపోయినట్టు మారడం సమస్య ప్రధాన లక్షణం. మెదడు, వెన్నుపాము నుంచి శరీరంలోకి విస్తరించే ముఖ్యమైన నాడులు మెడ ఎముక గుండానే ప్రయాణిస్తాయి. ఏదైనా కారణం వల్ల మెడ నాడుల మీద ఒత్తిడి పెరిగినప్పుడు మెడ నొప్పి మొదలవుతుంది. నిర్లక్ష్యం చేస్తే కండరాలు, రక్తనాళాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్య పురుషుల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

## మైగ్రెయిన్‌తో బాధపడుతున్నా? ఆ చికిత్స కరెక్టేనా?



మైగ్రెయిన్ పరీక్షల్లో బయటపడే సమస్య కాదు కాబట్టి, లక్షణాలను బట్టి, తీవ్రతలను బట్టి ఆ నొప్పిని అదుపులో ఉంచే చికిత్సను ఎంచుకోవలసి ఉంటుంది. ఈ పార్శ్వపు నొప్పి ఎంత తరచుగా వేధిస్తోంది, ఎంత తీవ్రంగా ఉంటోంది... మొదలైన అంశాల ఆధారంగా చికిత్స చేయవలసి ఉంటుంది. కేవలం నొప్పిని తగ్గించడమే కాకుండా, తరచూ తిరగబెట్టకుండా చేసే మందులు హోమియోపతిలో ఉన్నాయి. కొంత మందిలో ఈ మందులు మైగ్రెయిన్‌ను శాశ్వతంగా అరికడతాయి. అలాగే ఈ చికిత్సలో భాగంగా మైగ్రెయిన్‌తో పాటు అనుబంధంగా ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా కలిపి చికిత్స అందించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఈ మందులను వైద్యుల సలహా మేరకే వాడుకోవాలి. హోమియోలో మైగ్రెయిన్‌కు ఉపయోగపడే మందులు ఇవే!

బెలడోన: అకాసాత్తుగా తీవ్రమైన నొప్పి మొదలై, కళ్లు, ముఖం ఎర్రబడతాయి. వెలుతురు చూడలేరు.

బ్రయోనియా: ఏమాత్రం కదిలినా తలనొప్పి ఎక్కవవుతూ ఉంటుంది. వెలుతురు, శబ్దం భరించలేరు. అతి దాహం ఉంటుంది. తలను అదిమినట్టు పట్టుకుంటే ఉపశమనంగా ఉంటుంది.

జెల్సిమియం: తల బరువుగా ఉండడం, మెడ వెనక భాగం నుంచి నొప్పి మొదలవడం, తలలో పోట్లు, కళ్ల ముందు మెరుపులు కనిపించడం

శాంగ్వినేరియా: కుడి వైపు తల నొప్పి, మెనోపాజ్ దశకు చేరుకున్న స్త్రీలలో కనిపిస్తుంది.

స్పైజీలియా: ఎడం వైపు తల నొప్పి, గుండె దడ

ఐరిస్ వర్స్: తల కుడి భాగంలో నొప్పి, చెవి, కణతలు పగిలిపోతున్నంత బాధ, నొప్పి సూర్యోదయంతో మొదలై, సూర్యాస్తమయంతో ఉపశమనంపొందుతారు.

తూజా: ఎడమ కణతలో, తలలో నొప్పి, తలపై మేకులు గుచ్చినంత బాధ, వికారం

లాక్ కేన్: తల నొప్పి ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకు మారుతూ ఉంటుంది.

ఇగ్నీషియా: కోపం, దిగులు, దుర్వార్తలు తెలియగానే మొదలయ్యే తలనొప్పి

కాక్యులస్: ప్రయాణంతో వచ్చే తలనొప్పి, వాంతులు

సిడ్రాన్, పల్సటిల్లా, కాలీ ఫాస్, డామియానా, ఇపెకాక్ మొదలైన మందులతో కూడా ఫలితం ఉంటుంది.

రోగ లక్షణాల ఆధారంగా, కుటుంబ చరిత్ర లేదా దృష్టిలో తేడాలను బట్టి మైగ్రెయిన్‌ను నిర్ధారించి, చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. అలాగే సి.బి.పి, థైరాయిడ్, కిడ్నీ ఫంక్షన్, ఎలక్ట్రొలైట్స్ మొదలైన పరీక్షలు మైగ్రెయిన్ నిర్ధారణకు కొంత మేరకు తోడ్పడతాయి. మైగ్రెయిన్ సమస్యతో పాటు అనుబంధ సమస్యలకు కలిపి హోమియో మందులు వాడుకోవలసి ఉంటుంది. అయితే ఈ నొప్పి తీవ్రత, బాధించే సమయం ఎక్కువ కాబట్టి దాన్ని అదుపులో ఉంచడం కోసం మందు డోసును ఎక్కువసార్లు తీసుకోవలసి వస్తుంది. హోమియో మందులు మెదడు, శరీరాలు... రెండింటి మీదా ప్రభావం చూపిస్తాయి కాబట్టి మైగ్రెయిన్ నొప్పి త్వరగా తగ్గుతుంది. ఈ మందును నాలుక మీద ఉంచుకున్నప్పుడు, అక్కడి సున్నితమైన నరాల ద్వారా వేగంగా మెదడుకు చేరి, అక్కడి నరాల ఒత్తిడి తగ్గడం మూలంగా మైగ్రెయిన్ నొప్పి అదుపులోకొస్తుంది.

## మీ జట్టుకు రక్షణ ఈ పొడులే!



ఆయుర్వేదంలో జుట్టును సంరక్షించుకోవటానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వీటిలో హెయిర్‌మాస్కలను తయారు చేసుకోవటం ఒక ప్రధానమైన అంశం. ఈ హెయిర్‌మాస్కను ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం..

తయారీ విధానం

మన జుట్టును సంరక్షించే అనేక రకాల పొడర్లు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకొని.. వాటిని నీటితో కానీ.. పెరుగుతో కానీ.. కొబ్బరినూనెతో కానీ కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి 30 నిమిషాలు వదిలేయాలి. ఆ తర్వాత షాంపుతో జుట్టును కడగాలి. ఇప్పుడు ఆ పొడర్లు ఏమిటో చూద్దాం..

భృంగరాజ పొడి

భృంగరాజను మూలికల్లో రారాజుగా పిలుస్తారు. ఇది జుట్టును బలంగా చేస్తుంది. జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. కొందరిలో జుట్టు తెల్లపడకుండా అడ్డుకుంటుంది.

ఉసిరి పొడి

ఉసిరి పొడిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది జుట్టు నిగనిగలాడేలా చేస్తుంది. జుట్టు బలంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

వేప పొడి

కొందరికి మాడుపై బ్యాక్టీరియా చేసి రకరకాల సమస్యలు ఏర్పడుతూ ఉంటాయి. దురద పెడుతూ ఉంటుంది. ఈ సమస్యలకు వేప పొడి మంచి పరిష్కారమని చెప్పాలి.

మందార పొడి

మందారంలో విటమిన్స్, అమినో యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి జుట్టు ఊడిపోకుండా రక్షిస్తూ ఉంటాయి.

మెంతి పొడి

మెంతి పొడిలో ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌లు ఉంటాయి. ఇవి జుట్టు ఊడిపోకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి. మెంతి పొడిని పెరుగుతో కలిపి రాస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

కుంకుడు పొడి

జుట్టులో ఉండే దుమ్మును తొలగించటంలో కుంకుడు పొడి ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. దీని వల్ల జుట్టులో సహజంగా ఉండే నూనెలకు ఎటువంటి ప్రమాదం ఉండదు. షికాకాయ్ పొడి కూడా జుట్టు ఆరోగ్యంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

## ఈ చిట్కాలు పాటిస్తే ఉపశమనం పొందవచ్చు!



వేసవి వెతలకు ఆయుర్వేదంలో, హోమియో చికిత్సా విధానాలు కొన్ని చిట్కాలను సూచిస్తున్నాయి. అవేంటంటే...

ఆయుర్వేదం

పిత్త వేడికి సంబంధించినది కాబట్టి శరీర స్వభావం పిత్త అయినా, కాకపోయినా, వేసవిలో కొన్ని లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. పూర్వం లేని చిరాకు, విసుగు కనిపిస్తే మీలో పిత్త దోషం పెరుతున్నట్టు అర్థం. ఈ లక్షణాలు మానసికమైనవైతే, అలసట, జుట్టు పొడిబారడం, పొట్టలో పుండ్లు, ఛాతీలో మంట లాంటి శారీరక లక్షణాలూ కనిపిస్తాయి. ఇవన్నీ శరీరంలో వేడి పెరిగింది అనడానికి సూచనలు. దీనికి విరుగుడు శరీరాన్ని చల్లబరిచే ఆహారం తీసుకోవడమే! ఇందుకోసం....శీతలపానీయాలు కూడదు: చల్లదనం వేడికి విరుగుడు అనుకుంటాం. కానీ ఆహారం విషయంలో ఈ సూత్రం వర్తించదు. చల్లని శీతలపానీయాల వల్ల జీర్ణాగ్ని హెచ్చుమీరి అజీర్తి కలుగజేస్తుంది. కాబట్టి చల్లని నీరు, శీతలపానీయాలు తీసుకోకూడదు. బదులుగా గది ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉన్న తాజా నీరు తాగాలి. చల్లదనాన్నిచ్చే ఫలాలు, కూరగాయలు: పుచ్చ, ద్రాక్ష, దోస లాంటి పళ్లు శరీరాన్ని చల్లబరుస్తాయి. అలాగే పాలు, వెన్న, నెయ్యి కూడా శరీర వేడిని తగ్గిస్తాయి. దోసకాయ, బ్రొకొలి, కాలీఫ్లవర్ మొదలైన కూరగాయలు కూడా శరీర వేడిని విరుస్తాయి. వీటితోపాటు నీరు ఎక్కువగా ఉండే బీరకాయలు, పొట్లకాయలు కూడా తింటూ ఉండాలి.

హోమియోపతి

ఎండ వేడిమి వల్ల తలనొప్పి, ఒళ్లు నొప్పులు తలెత్తుతాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే హోమియో చిట్కాలను అనుసరిస్తే ఎండదెబ్బకు గురవకుండా ఉంటాం! అవేంటంటే...బెల్లడోనా: వేడిమి కారణంగా ముఖం నుంచి వేడి ఆవిర్లు వెలువడినా, కనుగుడ్లు తేలిపోతూ, విపరీతమైన తలపోటు ఉన్నా, స్వేదం లేకున్నా ఉక్కపోతగా తోచినా బెల్లడోనా తీసుకోవాలి. బ్రయోనియా: ఎండలో ఉన్నంతసేపు ఎలాంటి తలనొప్పి లక్షణం కనిపించకపోయినా, సాయంత్రానికి లేదా మరునాటికి మొదలైతే బ్రయోనియా మందు తీసుకోవాలి. ఫెర్రమ్ ఫాస్: ఈ ఐరన్ సెల్ సాల్ట్, కణతల దగ్గర తలెత్తే నొప్పికి చక్కని విరుగుడు. పల్సటిల్లా: కత్తితో పొడిచినట్టు తల మొత్తం బాధిస్తున్నప్పుడు పల్సటిల్లా వాడాలి. క్యాంథారిస్: ఎండకు కమిలిన చర్మం కోసం ఒకటి లేదా రెండు మోతాదుల క్యాంథారిన్ వాడాలి. అర్టికా యురెన్స్: చమటపొక్కుల వల్ల కలిగే నొప్పి, మంటల నుంచి ఉపశమనం కోసం ఈ మందును ఆ ప్రదేశాల్లో వాడవచ్చు.

## గర్భిణీలు ఇలా చేస్తే సుఖ ప్రసవానికి..!

గర్భం దాల్చినంత మాత్రాన వ్యాయామాలు పూర్తిగా మానుకోవలసిన అవసరం లేదు. నిజానికి తేలికపాటి వ్యాయామాలు సుఖ ప్రసవానికి తోడ్పడతాయి. కటి కండరాలు, ఎముకలు బలపడి ప్రసవం తర్వాత కోలుకునే సమయాన్నీ తగ్గిస్తాయి. ఇందుకోసం ఈ వ్యాయామాలు శిక్షకుల సహాయంతో చేయాలి.

ఎయిర్ పంచ్

చేతులు, భుజాలు, ఛాతీ ప్రదేశాల్లోని కండరాలు బలపడడం కోసం చేసే వ్యాయామమిది. ప్రసవానంతరం రొమ్ముల తీరు కుదురుగా ఉండడం కోసం, ఆ ప్రదేశంలోని కండరాలు సాగిపోకుండా ఉండడం కోసం గర్భిణిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యాయామాల చేయాలి. ఈ వ్యాయామాలు సౌకర్యాన్ని బట్టి నిలబడి లేదా కూర్చుని చేయవచ్చు. 30 సెకండ్ల పాటు ఈ వ్యాయామాలు చేయాలి. నిటారుగా నిలబడి మోకాళ్లను వంచాలి. కుడి వైపు చేయి పిడికిలి బిగించి అటు వైపు తల తిప్పి చూస్తూ పిడికిలిని గాల్లోకి విసరాలి. ఇలాగే ఎడమ వైపు కూడా చేయాలి. గాల్లోకి పంచ్ విసిరేటప్పుడు శరీరం ఎక్కువ కుదుపుకు గురి కాకుండా చూసుకోవాలి. ఇలా రెండు వైపులా పాటించాలి.

ఆర్మ్ ఎక్స్‌టెన్షన్ షోల్డర్ ట్యాప్

ఈ వ్యాయామంతో ఉదరం, కటి, కాళ్లు, చేతులు... ఇలా శరీరంలోని కీలకమైన అవయవాలకు సంబంధించిన కండరాలన్నీ బలపడతాయి. గర్భంతో పొట్టలో కొవ్వు పేరుకుంటోందని భయపడే మహిళలకు ఈ వ్యాయామం ఓ ఊరట. ప్లాంక్‌ను పోలిన ఈ వ్యాయామంతో పొత్తికడుపు దగ్గర పేరుకున్న కొవ్వు కరిగిపోతుంది. నేల మీద బోర్లా పడుకుని, మెకాళ్ల మీద లేచి ప్లాంక్ భంగిమలో పాదాలు, అరచేతులు మాత్రమే నేలకు ఆనించాలి. ఈ భంగిమలో చేతులు, కాళ్ల మీదే శరీర భారమంతా మోపాలి. శరీర బరువును కుడి చేతి మీదకు తీసుకువచ్చి, ఎడమ చేత్తో కుడి భుజాన్ని తాకి, తిరిగి చేతిని నేల మీద ఆనించాలి. తర్వాత ఎడమ చేతి మీద శరీర భారం మోపి, కుడి చేత్తో ఎడమ భుజాన్ని తాకి, తిరిగి చేతిని నేల మీద ఆనించాలి.

ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.

ఆర్మ్ సర్కిల్స్


నడుము పై భాగానికి ఉద్దేశించిన వ్యాయామం ఇది. చేతులు, భుజాలు, ఛాతీ, మెడలోని కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. పెరుగుతున్న గర్భం కారణంగా తలెత్తే మెడ నొప్పి, భుజాలు, వెన్ను నొప్పులు ఈ వ్యాయామంతో తగ్గుతాయి. నేల మీద కూర్చుని, లేదా నిలబడి ఈ వ్యాయామం చేయవచ్చు. చేతులు రెండు పక్కలకు చాపి కూర్చోవాలి. నిలబడి చేస్తున్నప్పుడు రెండు కాళ్లు మార్చి, మార్చి మడిచి, పైకి లేపి ఉంచాలి. అపసవ్య దిశలో చేతులు తిప్పుతున్నప్పుడు ఎడమకాలు, సవ్య దిశలో చేతులు తిప్పుతున్నప్పుడు కుడి కాలు లేపి ఉంచాలి.

# అనీల్ ని బాలయ్య ఓ ఆట ఆడుకున్నాడుగా!



యంగ్ డైరెక్టర్ అనీల్ రావిపూడి ఎనర్జీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆయన సినిమాల్లాగే ఆయన కూడా బయట చాలా ఎనర్జిటిక్ గా కనిపిస్తారు. చలాకీగా ఉంటాడు. సెట్ లోనూ అంతే ఉత్సాహాన్ని చూపిస్తారు. నటీనటులతో సరదాగా ఉంటాడు. వాళ్లని ఆట పట్టించడంలోనూ ముందుంటాడు. పనితో పాటు ఎంటర్ టైన్ చేయడంలో అంతే ఉత్సాహం చూపిస్తాడు. అలాంటి ట్యాలెంటెడ్ కాబట్టే కాజల్ అగర్వాల్...శ్రీలీలతో ఆఫ్ ది సెట్స్ కూడా డాన్స్ చేయించాడు. ఆ వీడియో నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. మరి ఇలాంటి ఎనర్జిటిక్ పర్సన్ కి బాలయ్య లాంటి డబుల్ ఎనర్జీ ఉన్న నటుడు తోడైతే ఆ వెదర్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాలా సరిగ్గా అదే సన్నివేశం చోటు చేసుకుంది భగవంత్ కేసరి సెట్స్ లో. ఇటీవలే ఈ కాంబినేషన్ లో రిలీజ్ అయిన సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆన్ సెట్స్ అనుభవాల్ని అనీల్ రివీల్ చేసాడు. చిన్ననాటి నుంచి బాలయ్య బాబు అంటే ఎంతో అభిమానం. ఆయనతో సినిమా చేయడం చాలా గర్వంగా అనిపించింది. ఆయన సెట్ లో జోకులు తెగ పెల్చేవారు. నా మీద బోలెడన్నీ సెటైర్లు వేసేవారు. ఆయన వచ్చారంటే నా పనైపోయేది. ఆయన నా మీద వేసే జోకులు..పంచ్ లు మామూలుగా ఉండేవి కాదు. అవన్నీ చాలా సరదాగా ఉండేవి. అలాగే ఓ దర్శకుడిగా నాకు అంతే గౌరవాన్ని ఇచ్చేవారు. ఆయన ఇచ్చిన గౌరవం అనేది ఎప్పటికీ మర్చిపోలేనిది. దర్శకుడిగా మరో మెట్టు ఎక్కడానికి ఆయనే ఆసరా అయ్యారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందర్నీ బాగా చూసుకుంటారు. తొలి వారికి డైలాగ్ డెలివిరీ విషయంలో సహాయపడుతుంటారు. భగవంత్ కేసరిలో ఆయనతో పాటు ఎనిమిది నెలలు పాటు గడపడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అని అన్నారు. బాయల్య పంచ్ లు ...సెటైర్లు వేస్తే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. అన్ స్టాపబుల్ వేదికగా ఆయన లో గొప్ప పంచ్ మాస్టర్ ఉన్నాడని అందరికీ తెలిసింది. షో సక్సెస్ అవ్వడానికి కారణం కూడా బాలయ్య అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# "జిగర్ తాండ డబుల్ ఎక్స్" రిలీజ్ డేట్ సస్పెన్స్ రివీల్.!




కోలీవుడ్ మల్టీ టాలెంటెడ్ నటుడు దర్శకుడు రాఘవ లారెన్స్ హీరోగా మరో వెర్సటైల్ నటుడు మరియు దర్శకుడు ఎస్ జె సూర్య లు నటించిన ఇంట్రెస్టింగ్ గ్యాంగ్ స్టర్ డ్రామా "జిగర్ తాండ డబుల్ ఎక్స్" కోసం కోలీవుడ్ ఆడియెన్స్ మంచి ఎగ్జైటింగ్ గా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించగా దీనికి మొదటి భాగం అయితే తెలుగులో గద్దలకొండ గణేష్ గా రీమేక్ చేశారు.అయితే ఈ సీక్వెల్ విషయంలో గత కొంత కాలం నుంచి రిలీజ్ డేట్ సస్పెన్స్ గా నిలవగా దీపావళి కానుకగా అయితే ఈ చిత్రం రిలీజ్ ని దీపావళి కానుకగా అని ఫిక్స్ చేసారు తప్ప రిలీజ్ డేట్ ని అయితే లాక్ చేయలేదు. కానీ ఇప్పుడు లారెన్స్ బర్త్ డే కానుకగా అయితే ఈ డేట్ ని అనౌన్స్ చేసేసారు. దీనితో అయితే ఈ చిత్రం ఈ నవంబర్ 10న రిలీజ్ చేయడానికి సిద్ధం చేసారు. మొత్తానికి అయితే ఈ సస్పెన్స్ పై ఫైనల్ గా ఓ క్లారిటీ వచ్చింది అని చెప్పాలి.

# 'భగవంత్ కేసరి" లేటెస్ట్ వసూళ్లు ఇవే!




నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం లో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్టైనర్ భగవంత్ కేసరి చిత్రం థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ చిత్రం 10 రోజుల్లో 123.92 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టడం జరిగింది. ఇది సెన్సేషన్ అని చెప్పాలి.వరల్డ్ వైడ్ గా భగవంత్ కేసరి కి వస్తున్న రెస్పాన్స్ పట్ల మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం లో శ్రీ లీల, అర్జున్ రాంపాల్ లు కీలక పాత్రల్లో నటించగా, మ్యూజికల్ సెన్సేషన్ థమన్ ఈ సినిమాకి సంగీతం అందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రం లాంగ్ రన్ లో మరింత వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హీరోయిన్‌తో లవ్.. అలా దొరికేసిన కిరణ్ అబ్బవరం




టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ కెరీర్‌లో ముందుకెళ్తున్నారు. ప్రేక్షకులను కంటిన్యూన్‌గా అలరిస్తున్నారు. అయితే ఈ హీరో.. ఓ హీరోయిన్‌తో ప్రేమలో మునిగిపోయారా అంటే.. నిజమే అని అర్థమవుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన... తన ప్రేమ గురించి పరోక్షంగా హింట్ ఇచ్చారు. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరనే వివరాల్లోకి వెళితే.. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. రాజావారు రాణిగారు చిత్రంతో టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌కు ఎంట్రీ ఇచ్చారు. ఇదే చిత్రంలో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది హీరోయిన్ రహస్య గోరఖ్. ఈ చిత్రం హీరోహీరోయిన్లుగా వీరిద్దరికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అయితే రాజావారు రాణిగారు షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య మొదలైన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారిందని బలంగా ప్రచారం సాగింది. సోషల్ మీడియాలో ఈ ఇద్దరిని ప్రేమ పక్షులు అంటూ ఎన్నో వార్తలు కూడా వచ్చాయి. కానీ వీరిద్దరు మాత్రం అస్సలు స్పందించలేదు. ఆ మధ్య కిరణ్ ఓ వెకేషన్ ట్రిప్‌కు వెళ్లి అక్కడ దిగిన ఫోటోలు షేర్ చేయగా.. మరోవైపు రహస్య కూడా అదే లొకేషన్‌లో దిగిన ఫోటోను షేర్ చేసింది. దీంతో వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నిజమేనని, ఇద్దరూ కలిసే షికారుకు వెళ్లారని అంతా అన్నారు. అనంతరం కిరణ్ గృహప్రవేశ వేడుకలోనూ ఈ ముద్దుగుమ్మ సందడి చేయడంతో ఆ పుకార్లు మరింత ఎక్కువయ్యాయి. అభిమానులు కూడా గట్టిగా ఫిక్స్ అయిపోయారు. అయితే తాజాగా మరోసారి దొరికిపోయారు కిరణ్ అబ్బవరం.పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ దావత్ అనే కొత్త షోను ప్రారంభించింది. ఈ షోకి కిరణ్ మొదటి గెస్టుగా వచ్చి సందడి చేశారు. అషురెడ్డి హోస్ట్‌గా వ్యవహరించింది. ఇద్దరు కలిసి పలు ఆసక్తికర విషయాలను మాట్లాడుకుని నవ్వించారు. అయితే అషురెడ్డి.. రహస్య గోరఖ్ – మీరు రిలేషన్‌లో ఉన్నారా అని అడిగేసింది. అలాంటిదేమీ లేదని, అలాంటిదేమైనా ఉంటే చెప్తామని బదులిచ్చాడు కిరణ్ అబ్బవరం. చెప్తాము అంటున్నారంటే ఇద్దరూ కలిసి ఒకేసారి పెళ్లి డేట్ ఎప్పుడో చెప్తారా అని మళ్లీ అషురెడ్డి నవ్వించింది. దీంతో కిరణ్ సిగ్గుపడిపోయాడు. నేను ఇచ్చిన ఏ ఇంటర్వ్యూలలో కూడా ఎప్పుడూ ఇంతలా దొరికిపోలేదు అని చెప్పుకొచ్చారు. దొరికిపోయాను అంటున్నారంటే నిజంగానే వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లేనని అంతా గట్టిగా ఫిక్స్ అయిపోయారు. దీనికి సంబంధించిన ఫుల్ ఇంటర్వ్యూ వీడియో త్వరలోనే రానుంది.

# స్టేషన్‌లో చియాన్ విక్రమ్ జులుం.. భయపడిన పోలీస్!




విభిన్న కథలు, పాత్రలతో ప్రేక్షకులను అలరించే తమిళ విలక్షణ హీరో చియాన్ విక్రమ్. ఆయన నటించే ప్రతి తమిళ సినిమా తెలుగులోనూ రిలీజ్ అవుతుంది. అయితే ఆయన ప్రస్తుతం ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు రెడీ అయ్యారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ గ్లింప్స్‌ను విడుదల చేసింది మూవీటీమ్. ఇది ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా మాస్‌గా కనిపిస్తూ అలరిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఎలాంటి పాత్రనైనా కొత్తగా, ప్రేక్షకులను కట్టిపడేసేలా చేసే అద్భుతమైన నటుల్లో విక్రమ్ ఒకరు. పితామగన్, సామి, అపరిచితుడు లాంటి భారీ విజయాలను అందుకున్న ఆయనకు.. ప్రస్తుతం భారీ హిట్లు పడట్లేదు. అయినా ఆయన నుంచి పెద్ద సినిమాలే వస్తున్నాయి. త్వరలోనే ఆయన కబాలి దర్శకుడు పా.రంజిత్‌తో చేసిన తంగలాన్ చిత్రంతో వచ్చే ఏడాది జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దీంతో పాటే విక్రమ్ కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. విక్రమ్ 62వ సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. రూరల్ డ్రామాగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. ఓ పోలీస్ స్టేషన్లోకి ఒక మహిళ తనను ఇద్దరు రౌడీలు అల్లరి చేశారని కంప్లైంట్ చేయడానికి వస్తుంది. అప్పుడు స్టేషన్‌లో అధికారులు ఎవరి పనిలో వారు ఉంటారు. ఈ లోగా ఓ ఇద్దరూ దెబ్బలు తింటూ వచ్చి పోలీస్ స్టేషన్లోకి పడతారు. వాళ్లను హీరో చియాన్ విక్రమ్ కొట్టుకుంటూ తీసుకొస్తారు. దీంతో స్టేషన్‌లో గందరగోళ వాతావరణం క్రియేట్ అవుతుంది. జులుం చూపించిన హీరోను ఆపేందుకు పోలీసులు ప్రయత్నిస్తారు. అప్పుడు ఓ పోలీసుకు తన గురించి చెవిలో ఏదో చెబుతాడు హీరో. అప్పుడా పోలీస్ భయపడతాడు. మరీ ఇంతకీ హీరో ఏం చెప్పాడు అతడి నేపథ్యం ఏంటన్నదే ఈ కథలా తెలుస్తోంది. ఇకత చివర్లో జాతరలో ఒక మామూలు స్కూటర్ మీద మార్కెట్ వస్తువులు తీసుకెళ్తూ కనిపించాడు హీరో. మొత్తంగా టీజర్ రొటీన్‌కు భిన్నంగానే కనిపించింది. డిఫరెంట్ ఎంటర్టైనర్ చూడబోతున్న ఫీలింగ్ కలిగించింది.

# విశాఖలో అగ్రనిర్మాత మేనేజర్ గొడవేంటి



విశాఖపట్నం నగర నడిబొడ్డున ఉన్న సంగం – శరత్ థియేటర్లు నిరంతర రద్దీతో కళకళలాడుతుంటుంది. ఇప్పుడు సంగం– శరత్ పేరు రాంగ్ రీజన్స్ తో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. ఈ పాపులర్ థియేటర్ల మేనేజర్ కి, టాలీవుడ్ అగ్రనిర్మాత దిల్ రాజు విశాఖ ఆఫీస్ మేనేజర్ కి మధ్య గొడవ జరిగిందని ప్రముఖ మీడియాలో కథనం వెలువడింది. ఏ విషయంలో ఇద్దరికీ గొడవ అంటే.. దిల్ రాజు కంపెనీ మేనేజర్ ఛత్రపతి (ప్రభాస్) చిత్రాన్ని ప్రత్యేక ప్రదర్శన కోసం సంగం శరత్ మేనేజర్ ని థియేటర్ల కోసం అడిగారు. అయితే అభిమానుల తాకిడి గడబిడతో థియేటర్లకు నష్టం వాటిల్లుతుందనే ఆందోళనతో యజమానులు దానిని తిరస్కరించారు. అయితే షో వేయడానికి ఛాన్సివ్వకపోతే సంక్రాంతి సినిమాలను మీ థియేటర్లలో ప్రదర్శించనివ్వను! అని దిల్ రాజు మేనేజర్ వ్యాఖ్యానించారని, ఇరు పార్టీల మధ్య మాటా మాటా పెరిగిందని చెబుతున్నారు ఈ గొడవలోనే ఎక్కడి నుంచో వచ్చి స్థానికులమైన మమ్మల్ని సవాల్ చేయడానికి మీరెవరు అంటూ దిల్ రాజు మేనేజర్ ని హెచ్చరించినట్లు సమాచారం. ఒంగోలుకు చెందిన వ్యక్తి వైజాగ్ దిల్ రాజు ఆఫీసులో పని చేస్తూ స్థానికంగా నివసిస్తున్నారని తెలిసింది. గొడవ అనంతరం థియేటర్ యజమానులు కొందరిని దిల్ రాజు మేనేజర్ వద్దకు పంపారని.. ఆ తర్వాత అతడిని అసభ్యపదజాలంతో దూషించారని.. ఫోన్‌లో వార్నింగ్ ఇచ్చారని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు అని కథనం వెలువడింది. ఒక ఫ్రైమ్ థియేటర్ యజమాని నన్ను చంపడానికి ప్లాన్ చేస్తున్నాడు! అని అతడు వాట్సాప్ స్టేటస్‌గా పోస్ట్ చేయడంతో రచ్చవుతోంది. ఈ గొడవలో దిల్ రాజు మేనేజర్ పై థియేటర్ యజమానులు కేసు పెట్టారని తెలిసింది. ఘటన అనంతరం దిల్ రాజు విశాఖపట్నం ఆఫీస్ మేనేజర్ ప్రముఖ మీడియాతో మాట్లాడుతూ... ఘటనను చిన్న సమస్యగా అభివర్ణించారు. తమ మధ్య కేవలం అపార్థం మాత్రమేనని.. ఇప్పుడు సరిదిద్దుకున్నామని ఆయన చెప్పినట్టు సమాచారం. అయితే కేసు విషయంలో రాజీ పడలేదని, ఫిర్యాదును ఉపసంహరించుకోలేదని శరత్ థియేటర్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989